విలేకరులు కావలెను
'వజ్రభారతి' తెలుగు దినపత్రిక లో
ఆంధ్ర ప్రదేశ్ మరియు
తెలంగాణ రాష్ట్రాలలో
అన్ని జిల్లాలకు, మండలాలకు
నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు,
మండల విలేకరులు కావలెను.
98498 39560



Cell : 98498 39560

RNI.No : APTEL/2021/80994

# వజ్రభారతి


Dare to Write... Dare to fight

vajrabharathi@gmail.com

ఎడిటర్ :
పమ్మి ఏడుకొండలు

సామాజిక, రాజకీయ జాతీయ తెలుగు దినపత్రిక








సంపుటి : 5 సంచిక : 66 ఎడిటర్ : పి.ఏడుకొండలు వెల : 2 రూపాయిలు తేదీ: శుక్రవారం 6-3-2026 పేజీలు : 12 E-mail:vajrabharathi@gmail.com




## విధ్వంసం చేయకుండానే మూసీ సుందరీకరణ పనులు చేయవచ్చు: కేటీఆర్

- బీఆర్ఎస్ హయాంలో ఐదున్నర కిలోమీటర్ల పొడవున సుందరీకరణ పనులు చేశామన్న కేటీఆర్
- ప్రజల ఆస్తులకు నష్టం చేయకుండా అభివృద్ధి చేయవచ్చని నిరూపించామన్న కేటీఆర్
- సుందరీకరణ పనులు తమకు అప్పగిస్తే రూ.16 వేల కోట్లకే చేసి చూపిస్తామని సవాల్

2లో

## తెలంగాణ కొత్త గవర్నర్ గా శివ ప్రతాప్ శుక్లా

- దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల గవర్నర్లను మారుస్తూ రాష్ట్రపతి ఉత్తర్వులు
- తెలంగాణ గవర్నర్‌గా హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా నియామకం
- ప్రస్తుత తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ మహారాష్ట్రకు బదిలీ
- ఢిల్లీ మరియు లడఖ్ లెఫ్టినెంట్ గవర్నర్ల స్థానాల్లోనూ మార్పులు



# యుద్ధబీభత్సం

## పశ్చిమాసియాలో కొనసాగుతున్న కల్లోలం



- అమెరికాకు చెందిన చమురు నౌకపై ఇరాన్ మెరుపు దాడి
- నౌక పూర్తిగా మంటల్లో చిక్కిందని పేర్కొన్న ఇరాన్ ప్రభుత్వ వర్గాల
- ఇరాక్, కువైట్‌ల్లో కూడా రెండు చమురు నౌకలపై దాడి!
- యూఏఈ, అజర్‌బైజాన్, దోహాపై బాంబులు, డ్రోన్లు
- ఇరాన్ నౌకాశ్రయంపై భారీ దాడులతో విరుచుకుపడ్డ అమెరికా
- దేశవ్యాప్తంగా భారీ స్థాయిలో క్షిపణి, బాంబు దాడులతో విధ్వంసం
- లెబనాన్‌పై దాడుల తీవ్రతను మరింత పెంచిన ఇజ్రాయెల్

దుబాయ్: పశ్చిమాసియాలో యుద్ధ బీభత్సం నానాటికీ పెరుగుతోంది. అమెరికా, ఇజ్రాయెల్ గురువారం ఆరో రోజు ఇరాన్ వ్యాప్తంగా భారీ స్థాయిలో క్షిపణులు, బాంబు దాడులతో విరుచుకుపడ్డాయి. ప్రతిగా ఇరాన్ కూడా ఇజ్రాయెల్‌పై పలు దఫాలుగా తీవ్ర స్థాయిలో దాడులు కొనసాగించింది. పలు గల్ఫ్ దేశాలపైనా మరిన్ని డ్రోన్ దాడులకు పాల్పడింది.

- మిగతా 2వ పేజీలో



2లో

## పరుగుల వరదతో ఫైనల్లోకి

- టీ20 ప్రపంచకప్‌లో తుది పోరుకు భారత్
- సెమీస్‌లో 7 పరుగులతో ఇంగ్లండ్‌పై గెలుపు
- మళ్లీ చెలరేగిన సంజు సామ్సన్
- బెతెల్ శతకం వృథా
- ఆదివారం న్యూజిలాండ్‌తో ఫైనల్

భారత జట్టు స్కోరు 253 పరుగులు... ఇందులో 18 ఫోర్లు, 19 సిక్స్‌లు.. వరల్డ్ కప్ చరిత్రలో ఏ జట్టూ కూడా ఇంత లక్ష్యాన్ని ఛేదించలేదు. ఇక గెలుపు లాంఛనమే, ఫైనల్ చేరడం ఖాయమనే అనిపించింది. కానీ ఇంగ్లండ్ కూడా ఏమాత్రం తగ్గలేదు. భారీ స్కోరును చూసి బెదిరిపోకుండా ఆ జట్టు కూడా 21 ఫోర్లు, 15 సిక్స్‌లతో ఆఖరి వరకూ పోరాడింది... కానీ అదృష్టవశాత్తూ టీమిండియా అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. పరుగుల వరద పారిన ఈ మ్యాచ్‌లో చివరకు 7 పరుగులతో సూర్యకుమార్ బృందం గట్టెక్కింది.



## జగన్ జీతం తీసుకోవడం లేదు

- వైసీపీ ఎమ్మెల్యేలు సభకు హాజరు కాకపోవడంపై అయ్యన్నపాత్రుడు అసహనం
- గవర్నర్ ప్రసంగం రోజున సభలో కాసేపు ఉన్నంత మాత్రాన అది పూర్తి హాజరు కాదని వ్యాఖ్య
- వైసీపీకి ప్రతిపక్ష హోదా ఇవ్వడం సాధ్యం కాదన్న స్పీకర్

2లో

## సింఘ్వీ, వేం ఎన్నిక ఏకగ్రీవమే!



- సంఖ్యాబలం లేక రాజ్యసభ పోటీలో నిలవని ప్రతిపక్ష బీఆర్ఎస్
- ఎమ్మెల్యేలెవరూ బలపరచకుండానే స్వతంత్ర అభ్యర్థిగా ఒకరి నామినేషన్
- నేడు స్క్రూటినీలో తిరస్కరణకు గురవుతుందన్న అసెంబ్లీ వర్గాలు
- సీఎం సమక్షంలో నామినేషన్లు వేసిన సింఘ్వీ, వేం నరేందర్‌రెడ్డి.. ఎన్నిక లాంఛనమే


హైదరాబాద్: తెలంగాణ నుంచి రాజ్యసభకు అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్‌రెడ్డి ఎన్నిక ఏకగ్రీవం కానుంది. కాంగ్రెస్ పార్టీ వారిద్దరినీ రాజ్యసభ అభ్యర్థులుగా ఎంపిక చేయగా గురువారం శాసనసభ ప్రాంగణంలో ఎన్నికల అధికారి ఉపేందర్‌రెడ్డికి నామినేషన్ పత్రాలను సమర్పించారు. తగినంత సంఖ్యాబలం లేనందున బీఆర్ఎస్ రాజ్యసభ ఎన్నికల బరిలో ఎవరినీ పోటీకి నిలపలేదు. సాయి అనే వ్యక్తి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసినప్పటికీ 10 మంది ఎమ్మెల్యేలు బలపరచాలనే నిబంధనను పాటించని కారణంగా ఆయన అభ్యర్థిత్వం శుక్రవారం

2లో



## రాజ్యసభకు నితీశ్ నామినేషన్

- బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబీన్ కూడా
- బిహార్‌లో మొత్తం ఆరుగురు అభ్యర్థుల నామినేషన్లు
- సీఎం పదవి నుంచి తప్పుకుంటున్నట్లు నితీశ్ ప్రకటన
- కొత్త ప్రభుత్వానికి తన సహకారం ఉంటుందని వెల్లడి



## జనాభా నియంత్రణ కాదు.. ఇప్పుడు నిర్వహణే ముఖ్యం

- ఒకరు వద్దు.. ముగ్గురు ముద్దు.. మారిన పరిస్థితులకు తగ్గట్టు కొత్త నినాదం
- రాష్ట్రంలో ఫెర్టిలిటీ రేటు 1.5కి పడిపోవడం భవిష్యత్తుకు ప్రమాదకరమని వెల్లడి
- ఎంతమంది పిల్లలుంటే అంతమందికి 'తల్లికి వందనం' అందిస్తామని ప్రకటన
- తెలుగు జాతి శక్తిమంతంగా ఉండాలంటే జనాభా 5 కోట్లకు తగ్గకూడదని ఉద్ఘాటన

గతంలో జనాభా పెరిగితే ఏమవుతుందో అని ఆందోళన చెందాను. కానీ ఇప్పుడు మారిన పరిస్థితుల రీత్యా విధానాలు మార్చుకున్నాం... అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. అమరావతి అసెంబ్లీ వేదికగా పాపులేషన్ మేనేజ్మెంట్ పాలసీ ప్రకటనపై జరిగిన చర్చలో సీఎం

# జగన్ జీతం తీసుకోవడం లేదు

(మొదటి పేజీ తరువాయి)

ఆంధ్రప్రదేశ్ శాసనసభ బడ్జెట్ సమావేశాలకు వైసీపీ ఎమ్మెల్యేలు గైర్హాజరవుతుండటంపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు తీవ్రంగా స్పందించారు. ఈరోజు అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ, ప్రజలు తమ సమస్యల గురించి గళం విప్పుతారని ఓట్లు వేసి గెలిపిస్తే, సభకు రాకుండా పారిపోవడం ప్రజాస్వామ్యాన్ని పరిహసించడమేనని మండిపడ్డారు. సభకు హాజరుకాకుండా కేవలం బయట ఉంటూ జీతభత్యాలు తీసుకోవడం నైతికంగా సరికాదని అన్నారు. వైసీపీ ఎమ్మెల్యేలంతా జీతాలు తీసుకుంటున్నారని, ఆ పార్టీ అధినేత జగన్ మాత్రం జీతం తీసుకోవడం లేదని చెప్పారు. కేవలం గవర్నర్ ప్రసంగం రోజున వచ్చి కాసేపు నిరసన తెలిపి వెళ్లినంత మాత్రాన అది పూర్తిస్థాయి హాజరు అనిపించుకోదని స్పీకర్ స్పష్టం చేశారు. రాజ్యాంగ నిబంధనల ప్రకారం వరుసగా 65 రోజుల పాటు సభకు అనుమతి లేకుండా గైర్హాజరైతే ఆ సభ్యులపై కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని, వారికి నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరించే ప్రజా ప్రతినిధులను 'రీకాల్' చేసే హక్కు ప్రజలకు ఉండాలని, దీనిపై చట్ట సవరణలు అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సమస్య కేవలం ఏపీకే పరిమితం కాదని, దేశవ్యాప్తంగా చట్టసభల గౌరవాన్ని కాపాడటానికి లోక్‌సభ స్పీకర్‌ను కలిసి చర్చిస్తానని తెలిపారు. ప్రస్తుతం అసెంబ్లీలో ప్రతి ఎమ్మెల్యే సీటు వద్ద ఏర్పాటు చేసిన ఏఐ ఆధారిత ఫేషియల్ రికగ్నిషన్ కెమెరాల ద్వారా సభ్యుల హాజరును కచ్చితంగా నమోదు చేస్తున్నామని, దీని ద్వారా ఎవరు ఎంతసేపు సభలో ఉన్నారో రికార్డు అవుతుందని స్పీకర్ వివరించారు. నిబంధనల ప్రకారం కనీసం 10 శాతం సీట్లు (18 మంది ఎమ్మెల్యేలు) ఉన్న పార్టీకి మాత్రమే ప్రతిపక్ష హోదా లభిస్తుందని, కేవలం 11 సీట్లు ఉన్న వైసీపీకి ఆ హోదా ఇవ్వడం సాధ్యం కాదని అయ్యన్న పాత్రుడు మరోసారి తేల్చిచెప్పారు.

# తెలంగాణ కొత్త గవర్నర్ గా శివ ప్రతాప్ శుక్లా

(మొదటి పేజీ తరువాయి)

దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల గవర్నర్లు, కేంద్రపాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లను బదిలీ చేస్తూ కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. మార్చి 5న వెలువడిన తాజా ఉత్తర్వుల ప్రకారం.. తెలంగాణతో పాటు మహారాష్ట్ర, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, బీహార్ తదితర రాష్ట్రాలకు కొత్త గవర్నర్లను నియమించారు. ముఖ్యంగా తెలంగాణ గవర్నర్ పదవిలో మార్పు చోటుచేసుకుంది. ప్రస్తుతం హిమాచల్ ప్రదేశ్ గవర్నర్‌గా ఉన్న శివ ప్రతాప్ శుక్లాను తెలంగాణ నూతన గవర్నర్‌గా నియమించారు. ఇప్పటివరకు తెలంగాణ గవర్నర్‌గా వ్యవహరించిన జిష్ణు దేవ్ వర్మను మహారాష్ట్ర గవర్నర్‌గా బదిలీ చేశారు. రాష్ట్రపతి ఆమోదంతో ఈ ఉత్తర్వులు తక్షణం అమల్లోకి వచ్చాయి. పరిపాలనా సౌలభ్యం, వ్యూహాత్మక కారణాల దృష్ట్యా ఈ మార్పులు జరిగినట్లు తెలుస్తోంది. కొత్తగా నియమితులైన గవర్నర్లు త్వరలోనే ఆయా రాష్ట్రాల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు.

**రాజ్యసభకు నితీశ్ నామినేషన్**

పట్నా: బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్, బీజేపీ చీఫ్ నితిన్ నబీన్ సహా ఐదుగురు గురువారం ఎన్డీయే తరఫున రాజ్యసభ అభ్యర్థులుగా నామినేషన్లు వేశారు. జేడీయూ చీఫ్‌గా ఉన్న నితీశ్ కుమార్, జనవరిలో బీజేపీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టిన నబీన్‌లు ఢిల్లీ నుంచి వచ్చిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమక్షంలో విధాన సభ సెక్రటేరియట్‌లో అధికారులకు నామినేషన్ పత్రాలను సమర్పించారు. నామినేషన్లు వేసిన ఎన్డీయే అభ్యర్థుల్లో జేడీయూకు చెందిన కేంద్ర మంత్రి రామ్‌నాథ్ ఠాకూర్, ఆర్ఎల్ఎం చీఫ్ ఉపేంద్ర కుష్వాహ, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివేశ్ కుమార్ ఉన్నారు. వీరితోపాటు ఆర్జేడీ బలపరిచిన సిట్టింగ్ ఎంపీ, వ్యాపారవేత్త అమరేంద్ర ధారి సింగ్ సైతం నామినేషన్ వేశారు. ఆయన వెంట ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ ఉన్నారు. సీఎం నితీశ్ కుమారుడు నిశాంత్ కుమార్ క్రియాశీల రాజకీయాల్లోకి వస్తున్నట్లుగా వార్తలు గుప్పుమన్న రెండు రోజుల్లోనే నితీశ్ రాజ్యసభకు నామినేషన్ వేయడం గమనార్హం. నితీశ్ కుమార్ రాజీనామాతో సీఎం పదవిని బీజేపీ నేత చేపడతారని భావిస్తున్నారు. అదేవిధంగా, ఇంజనీరింగ్ పట్టభద్రుడైన 40 ఏళ్ల నిశాంత్ కొత్త ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంగా చేరుతారని అంటున్నారు. సీఎం రేసులో ఉన్న వారిలో ప్రస్తుత డిప్యూటీ సీఎం సమ్రాట్ చౌదరి పేరు గట్టిగా వినిపిస్తోంది. గతేడాది నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అధికార ఎన్డీయేను అఖండ విజయం వైపు నడిపించిన నితీశ్ రాజీనామాతో బీజేపీ నేత ఒకరు ఆ పదవిని చేపట్టే అవకాశం ఉంది. ఇప్పటివరకు ఆ పార్టీ అభ్యర్థి సీఎం పదవిని చేపట్టని ఏకైక హిందీ రాష్ట్రం బిహార్. అయితే, నితీశ్ నిర్ణయాన్ని నిరసిస్తూ జేడీయూ కార్య కర్తలు ఆయన నివాసం వద్దకు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. 'రాష్ట్ర రాజకీయాలను వదిలి రాజ్యసభకు వెళ్లా లని నితీష్ తీసుకున్న నిర్ణయం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఆయన నిర్ణయంపై పార్టీ కార్యకర్తలు సంతోషంగా లేరు. ఆయన సీఎంగా కొనసాగాలి' అని రాష్ట్ర సున్నీ వక్ఫ్ బోర్డు చైర్మన్, జేడీ(యూ) నేత అల్వాజ్ మొహమ్మద్ ఇర్షాదుల్లా అన్నారు. నితీశ్ ట్వీట్ చూడగానే ఆయన రాసింది కాదని తేలిపోయింది. అది ఢిల్లీ నుంచి వచ్చిన ఆదేశమని అర్థ మైందని ఆర్జేడీ మరో నేత మనోజ్ ఝా వ్యాఖ్యానించారు.

# విధ్వంసం చేయకుండానే మూసీ సుందరీకరణ పనులు చేయవచ్చు: కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

విధ్వంసం చేయకుండా, ఎవరి ఇళ్లు కూల్చకుండా కూడా అభివృద్ధి, సుందరీకరణ పనులు చేయవచ్చని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు మూసీ పరివాహక ప్రాంతంలో ఐదున్నర కిలోమీటర్ల పొడవున సుందరీకరణ పనులు చేశామని గుర్తు చేశారు. ప్రజల ఆస్తులకు నష్టం చేయకుండా అభివృద్ధి చేయవచ్చని చెప్పడానికి ఇదే నిదర్శనమని అన్నారు. హైదరాబాద్ నగరంలోని నాగోల్‌లో సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ (ఎస్టీపీ)ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నగరంలో హైడ్రా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలకు అడ్డు అదుపు లేకుండా పోయిందని మండిపడ్డారు. పేదల ఇళ్లు కూల్చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.1.50 లక్షల కోట్లతో మూసీ సుందరీకరణ పనులు చేస్తామని ముఖ్యమంత్రి చెబుతున్నారని, కానీ రూ.16 వేల కోట్లతోనే ఆ పనులు చేయవచ్చని అన్నారు. మూసీ సుందరీకరణ పనులను తమకు అప్పగిస్తే రూ.16 వేల కోట్లకే చేసి చూపిస్తామని అన్నారు. పైగా ఒక్క ఇల్లు కూడా కూల్చకుండా అభివృద్ధి చేస్తామని అన్నారు. హామీల అమలు కోసమే కాంగ్రెస్ పార్టీకి ప్రజలు పట్టం కట్టారని అన్నారు.

# పరుగుల వరదతో ఫైనల్లోకి

ముంబై: టి20 వరల్డ్ కప్‌ను నిలబెట్టుకునే ప్రయత్నంలో భారత జట్టు ఒకే ఒక్క అడుగు దూరంలో నిలిచింది. వరుసగా రెండోసారి మన టీమ్ తుది పోరుకు అర్హత సాధించింది. గురువారం వాంఖెడే మైదానంలో హోరాహోరీగా సాగిన రెండో సెమీఫైనల్ సమరంలో 7 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌ను ఓడించి భారత్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. టాస్ గెలిచిన ఇంగ్లండ్ ఫీల్డింగ్ ఎంచుకోగా, ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 253 పరుగులు చేసింది.'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సంజు సామ్సన్ (42 బంతుల్లో 89; 8 ఫోర్లు, 7 సిక్సులు) మెరుపు బ్యాటింగ్‌తో చెలరేగగా... శివమ్ దూబే (25 బంతుల్లో 43; 1 ఫోర్, 4 సిక్సులు), ఇషాన్ కిషన్ (18 బంతుల్లో 39; 4 ఫోర్లు, 2 సిక్సులు) కీలక పరుగులు సాధించారు. అనంతరం ఇంగ్లండ్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 246 పరుగులు చేసి ఓడిపోయింది. జాకబ్ బెతెల్ (48 బంతుల్లో 105; 8 ఫోర్లు, 7 సిక్సులు) సెంచరీతో పోరాడినా జట్టుకు ఓటమి తప్పలేదు. ఆదివారం అహ్మదాబాద్‌లో జరిగే ఫైనల్లో న్యూజిలాండ్‌తో భారత్ తలపడుతుంది. భారత్, కివీస్ మధ్య టి20 వరల్డ్ కప్ ఫైనల్ జరగడం ఇదే తొలిసారి.



ఓపెనర్ అభిషేక్ శర్మ (9) మరోసారి విఫలమైనా... సామ్సన్, ఇషాన్ భాగస్వామ్యంతో భారత్ దూసుకుపోయింది. ఆర్చర్ తొలి ఓవర్లో వరుసగా 4, 6 కొట్టిన సామ్సన్ అతని రెండో ఓవర్లో కూడా 2 ఫోర్లు, సిక్స్ బాదాడు. మరోవైపు ఇషాన్ కూడా మూడు ఫోర్లు కొట్టడంతో పవర్‌ప్లే ముగిసేసరికి స్కోరు 67 పరుగులకు చేరింది. డాసన్ ఓవర్లో భారీ సిక్స్‌తో 26 బంతుల్లో సామ్సన్ అర్ధ సెంచరీ పూర్తి చేసుకోగా, స్యామ్ కరన్ ఓవర్లో ఇద్దరూ కలిసి 20 పరుగులు రాబట్టారు. రెండో వికెట్‌కు 45 బంతుల్లో 97 పరుగులు జోడించిన తర్వాత ఎట్టకేలకు ఇషాన్‌ను రషీద్ అవుట్ చేశాడు. అయితే స్పిన్‌ను సమర్థంగా ఎదుర్కొనే వ్యూహంతో బ్యాటింగ్‌లో ముందుగా దూబేను పంపిన భారత్ ఫలితం రాబట్టింది. రషీద్ ఓవర్లో 2 భారీ సిక్స్‌లతో అతను చెలరేగాడు. ఆ తర్వాత ఆర్చర్ ఓవర్లో మరో రెండు సిక్సులు బాదిన సామ్సన్ మరింత దూకుడుగా ఆడే ప్రయత్నంలో వెనుదిరిగాడు. సూర్యకుమార్ (11) ఎక్కువసేపు నిలవలేకపోగా, ఒవర్టన్ ఓవర్లో హార్దిక్ పాండ్యా (12 బంతుల్లో 27; 3 ఫోర్లు, 2 సిక్సులు) మూడు ఫోర్లు కొట్టాడు. ఆర్చర్ వేసిన 19వ ఓవర్లో తిలక్ వర్మ (7 బంతుల్లో 21; 3 సిక్సులు) ఏకంగా మూడు భారీ సిక్సర్లతో రెచ్చిపోయాడు. 20వ ఓవర్లో పాండ్యా మరో 2 సిక్సులు కొట్టడంతో స్కోరు 250 దాటింది. ఆఖరి 5 ఓవర్లలో భారత్ 76 పరుగులు సాధించడం విశేషం. భారీ లక్ష్య ఛేదనలో ఇంగ్లండ్ ఆరంభంలోనే ఫిల్ సాల్ట్ (5) వికెట్ కోల్పోయింది. జోస్ బట్లర్ (17 బంతుల్లో 25; 4 ఫోర్లు, 1 సిక్స్), హ్యారీ బ్రూక్ (7), టామ్ బాంటన్ (17) కూడా ఎక్కువసేపు నిలవలేకపోయారు. అయితే బెతెల్ మాత్రం పోరాటపటిమ కనబర్చాడు. బుమ్రా బౌలింగ్‌లో సిక్స్ కొట్టిన అతను వరుణ్ చక్రవర్తి ఓవర్లో వరుసగా 6, 6, 6 బాదడం విశేషం.

# జనాభా నియంత్రణ కాదు.. ఇప్పుడు నిర్వహణే ముఖ్యం

(మొదటి పేజీ తరువాయి)

సుదీర్ఘంగా ప్రసంగించారు. ఒకప్పుడు జనాభా నియంత్రణే పరమావధిగా భావించిన తాము, నేడు జనాభా నిర్వహణ (పాపులేషన్ మేనేజ్ మెంట్) వైపు ఎందుకు అడుగులు వేయాల్సి వచ్చిందో సవివరంగా తెలియజేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో టోటల్ ఫెర్టిలిటీ రేట్ (టీఎఫ్ఆర్) ప్రమాదకర స్థాయిలో 1.5కి పడిపోయిందని సీఎం గణాంకాలతో సహా వివరించారు. ఇదే ధోరణి కొనసాగితే దక్షిణాది రాష్ట్రాల్లో నెగెటివ్ గ్రోత్ నమోదవుతుందని, భవిష్యత్తులో నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) జరిగితే రాజకీయంగా దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ సంక్షోభాన్ని దృష్టిలో ఉంచుకునే జనాభా నిర్వహణ విధానాన్ని తెరపైకి తెచ్చామన్నారు. గతంలో మాల్థూషియన్ థియరీ ప్రకారం జనాభా విపరీతంగా పెరిగితే ప్రకృతి వైపరీత్యాలు, కరవు కాటకాలు వస్తాయనే భయం ఉండేదని, అందుకే ఆనాడు కఠినమైన జనాభా నియంత్రణ చర్యలు చేపట్టామని చంద్రబాబు గుర్తు చేశారు. 96-97 ప్రాంతంలో ఎయిడ్స్ వ్యాధి నియంత్రణ కోసం 'బ్రేక్ సైలెన్స్' అంటూ ప్రచారాలు నిర్వహించామని, ఆర్థిక సంస్కరణలు, సాంకేతిక విప్లవం, కుటుంబ నియంత్రణ చర్యలతో సామాజికంగా ఎన్నో విజయాలు సాధించామని తెలిపారు. అయితే, నాడు తీసుకున్న ఆ చర్యల ఫలితంగా ఇప్పుడు పరిస్థితి పూర్తిగా తారుమారైందని, ప్రస్తుతం జనాభా తగ్గుదల అనేది కొత్త సవాలుగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. "ఇప్పుడు ఒకరు వద్దు.. ఇద్దరు ఒకే.. ముగ్గురు ముద్దు" అనే కొత్త నినాదాన్ని తీసుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడిందని చంద్రబాబు పేర్కొన్నారు. చైనా కేవలం ఒక్క సంతానం విధానంతో ఇప్పుడు వృద్ధాప్య జనాభాతో తీవ్ర సమస్యలు ఎదుర్కొంటోందని ఉదహరించారు. ఈ క్రమంలోనే కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి 'తల్లికి వందనం' పథకం వర్తింపజేస్తామని ప్రకటించారు. కుటుంబంలో ఎక్కువ మంది సభ్యులు ఉండేలా, మైక్రో ఫ్యామిలీస్ స్థానంలో ఉమ్మడి కుటుంబాల వ్యవస్థను ప్రోత్సహించేలా ప్రభుత్వ విధానాల్లో మార్పులు చేస్తామన్నారు. పెద్ద కుటుంబాలకు ప్రభుత్వం తరపున ఎక్కువ ప్రోత్సాహకాలు అందిస్తామని హామీ ఇచ్చారు. సమాజంలో వస్తున్న మార్పులపైనా సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో బాల్య వివాహాలు సమస్యగా ఉండేవని, ఇప్పుడు ఆలస్యంగా వివాహాలు చేసుకోవడం వల్ల సంతానలేమి సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు.

# సింఘ్వీ, వేం ఎన్నిక ఏకగ్రీవమే!

స్క్రూటినీలో తిరస్కరణకు గురవుతుందని అసెంబ్లీ వర్గాలు తెలిపాయి. దీంతో రాష్ట్రం నుంచి రాజ్యసభకు పార్టీ హైకమాండ్ ప్రతిపాదించిన సింఘ్వీ రెండోసారి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్నేహితుడు వేం నరేందర్‌రెడ్డి రాజ్యసభలో అడుగుపెట్టడం లాంఛనం కానుంది. కాంగ్రెస్ పార్టీ తరఫున రాష్ట్రం నుంచి రాజ్యసభ అభ్యర్థులుగా ఎంపికైన అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్‌రెడ్డి ఉదయం 10:30 గంటలకు మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి శాసనసభకు వచ్చి నామినేషన్లు దాఖలు చేశారు. మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీకి రాగా ఆయనతో కలిసి వెళ్లి మరో సెట్ నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారి ఉపేందర్‌రెడ్డికి అందజేశారు. సింఘ్వీ మూడు సెట్ల నామినేషన్లు దాఖలు చేయగా వేం నరేందర్‌రెడ్డి నాలుగు సెట్లు దాఖలు చేశారు. మిత్రపక్షంగా ఉన్న ఎంఐఎం నుంచి నామినేషన్ల దాఖలు కార్యక్రమానికి హాజరైన ఎంఐఎం ఎమ్మెల్యేలు అహ్మద్ బిన్ బలాలా, జుల్ఫికర్ అలీ ఒక సెట్ నామిషన్ పత్రాలపై సంతకాలు చేశారు. ఊహించినట్లుగానే బీఆర్ఎస్ రాజ్యసభ బరిలో అభ్యర్థిని దించలేదు. రాజ్యసభ సభ్యత్వాన్ని పొందేందుకు అవసరమైన 40 మంది శాసనసభ్యుల బలం లేకపోవడంతో పోటీ చేయలేదని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.

నామినేషన్ దాఖలు అనంతరం వేం నరేందర్‌రెడ్డితో కలిసి గాంధీ భవన్‌కు వచ్చిన అభిషేక్ మను సింఘ్వీకి పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కలిశారు. అనంతరం సింఘ్వీ తెలంగాణ తరఫున రాజ్యసభకు రెండోసారి వెళ్లనుండటాన్ని అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. రెండోసారి తెలంగాణ నుంచి ఎంపీగా తనను ఎంపిక చేసిన కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్‌కు ధన్యవాదాలు తెలిపారు. వేం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ నుంచి రాజ్యసభకు వెళ్లడం ఆనందంగా ఉందని.. ఇప్పటివరకు ఎలా పనిచేశానో, భవిష్యత్తులోనూ అలాగే పనిచేస్తానన్నారు. రాష్ట్రానికి రావాల్సిన హక్కులు, నిధుల కోసం పోరాడుతానని పేర్కొన్నారు. తనను రాజ్యసభకు ఎంపిక చేసిన రేవంత్‌రెడ్డి, మహేశ్‌గౌడ్‌కు ధన్యవాదాలు తెలిపారు. కాగా, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కుమారుడి పెళ్లికి హాజరయ్యేందుకు హైదరాబాద్ వచ్చిన పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను సింఘ్వీ, వేం నరేందర్‌రెడ్డిలతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.

# యుద్ధ బీభత్సం



ఇరు పక్షాలూ నౌకలు, నౌకాశ్రయాలను లక్ష్యంగా చేసుకున్నాయి. పర్షియన్ గల్ఫ్‌లో అమెరికా చమురు నౌకపై దాడి చేసినట్టు ఇరాన్ ప్రకటించింది. దానికి నిప్పంటుకుని భారీగా మంటలు ఎగసిపడుతున్నట్టు ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ (ఐఆర్‌జీసీ) తెలిపింది. బుధవారం శ్రీలంక తీర సమీపంలో తమ యుద్ధనౌకపై అమెరికా జలాంతర్గామితో దాడి చేసి ముంచేసినందుకు ప్రతీకారంగా ఈ చర్యకు దిగినట్టు వెల్లడించింది. తమ యుద్ధ నౌకను ముంచేసినందుకు అమెరికా తీవ్రంగా పశ్చాత్తాప పడాల్సి వస్తుందని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ హెచ్చరించారు. ఆ దేశ నౌకలను ఆ స్థాయిలో లక్ష్యం చేసుకుంటామని ప్రకటించిన కాసేపటికే ఐఆర్‌జీసీ నుంచి దాడి వార్త వెలువడింది. అమెరికా మాత్రం తమ చమురు నౌకపై దాడి జరిగినట్టు ధ్రువీకరించలేదు. అంతేగాక దక్షిణ ఇరాన్‌లోని కీలకమైన బందర్ అబ్బాస్ నౌకాశ్రయంపై అమెరికా యుద్ధ విమానాలు భారీస్థాయిలో విరుచుకుపడ్డట్టు తెలుస్తోంది. అక్కడ చాలాసేపటిదాకా భారీ స్థాయిలో పేలుళ్లు వినిపించినట్టు స్థానికులను ఉటంకిస్తూ మీడియా కథనాలు వెలువడ్డాయి. కీలకమైన హార్మూజ్ జలసంధికి బందర్ అబ్బాస్ అతి సమీపంలో ఉంటుంది. హార్మూజ్‌ను ఇరాన్ ఇక్కడినుంచే నియంత్రిస్తూ ఉంటుంది. మరోవైపు కువైట్‌లో కూడా ఒక చమురు నౌకపై దాడి జరిగింది. దాంతో అందులోని చమురు సముద్రంలోకి ఒలికిపోతున్నట్టు సమాచారం. ఇది కూడా ఇరాన్ పనేనని భావిస్తున్నారు! ఇరాక్‌లోని ఖోర్ అలా జుబెయిర్ నౌకాశ్రయం వద్ద బహమాస్‌కు చెందిన మరో చమురు నౌకపైనా ఇరాన్‌కు చెందిన బోటు ఆత్మాహుతి దాడికి దిగింది. యుద్ధం మొదలైనప్పటి నుంచీ గల్ఫ్ ప్రాంతంలో దాడుల బారిన పడ్డ చమురు నౌకల సంఖ్య 9కి చేరింది. ఐఅమెరికా తమ యుద్ధ నౌకను ముంచేసిన కాసేపటికే ఇరాన్ రెచ్చిపోయింది. ఇజ్రాయెల్‌తో పాటు గల్ఫ్ దేశాలపై బుధవారం అర్ధరాత్రి నుంచే దాడులను తీవ్రతరం చేసింది. దాంతో జెరూసలేం, టెల్ అవీవ్‌తో పాటు పలు నగరాల్లో జనం వేలాదిగా బంకర్లలో తలదాచుకుంటున్నారు. పదులకొద్దీ క్షిపణులు, డ్రోన్లను అడ్డుకుని నేల కూల్చినట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది. యూఏఈ, ఖతర్‌తో పాటు దోహాలోని అమెరికా సైనిక స్థావరాలపైనా ఇరాన్ ఎడాపెడా డ్రోన్ దాడులకు దిగింది. ఆరు ఖండాంతర క్షిపణులతో పాటు 125 డ్రోన్లను అడ్డుకుని కూల్చేసినట్టు యూఏఈ ప్రకటించింది. అబుదాబిలో డ్రోన్ శకలాలు పడి ఆరుగురు గాయపడ్డారు. దాడుల నేపథ్యంలో దోహాలోని అమెరికా రాయబార కార్యాలయం సమీప ప్రాంతాలను ఖతర్ ఖాళీ చేయించింది. దాడుల తీవ్రత దృష్ట్యా దుబాయ్‌లోని ఎమర్జెన్సీ లాజిస్టిక్స్ హబ్‌లో కార్యకలాపాలను నిలిపేస్తున్నట్టు ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. అమెరికా, ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా గళం విప్పకపోతే యూరప్ దేశాలు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ఇరాన్ హెచ్చరించింది! అంతేగాక తన దాడులను అజర్‌బైజాన్‌కూ విస్తరించడం కలకలం రేపుతోంది. నఖ్చివాన్‌లో విమానాశ్రయంతో పాటు ఓ స్కూలు వద్దా పేలుళ్లు సంభవించాయి. దాంతో ఇరాన్ సరిహద్దుల సమీపంలో గగనతలాన్ని అజర్‌బైజాన్ మూసేసింది. తమపై భారీ స్థాయిలో డ్రోన్ దాడులు జరిగాయంటూ మండిపడింది. ఇందుకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని అధ్యక్షుడు ఇల్హాం అలియేవ్ డిమాండ్ చేశారు. మరోవైపు అమెరికా ఎఫ్15ఈ యుద్ధ విమానం ఇరాన్‌లో కుప్పకూలినట్టు వార్తలొచ్చాయి. వాటిని యూఎస్ సెంట్రల్ కమాండ్ మాత్రం ఖండించింది. పశ్చిమాసియా దేశాల నుంచి ఐదు రోజులుగా దాదాపుగా పడకేసిన విమాన సర్వీసులు గురువారం పాక్షికంగా కొనసాగాయి. ఒమన్, ఖతర్ తదితర దేశాలు పలు సర్వీసులను నడిపాయి. దాంతో ఆయా దేశాల్లో చిక్కుబడ్డ యూరప్ తదితర దేశాలకు చెందిన వేలాదిమంది తిరుగు ప్రయాణమయ్యారు. యుద్ధ కల్లోలం ఇప్పటికే ఆందోళనలు రేకెత్తిస్తున్న వేళ ఇరాన్ ఉద్రిక్తతలను మరింతగా పెంచే ప్రకటనలకు దిగుతోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో పాటు ఇజ్రాయెలీల రక్తం కూడా కళ్లజూడాలంటూ ఇరాన్ మత పెద్ద అయతొల్లా అబ్దొల్లా జావేదీ అమోలీ ఏకంగా ప్రభుత్వ వార్తా చానల్లోనే దేశవాసులకు పిలుపునిచ్చారు.



# సీఎం చంద్రబాబును కలిసిన తణుకు ఎమ్మెల్యే

**తణుకు, వజ్రభారతి, మార్చి 5:** రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడితో తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ గురువారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబును కలిసిన ఆయన తణుకు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. తణుకు నియోజకవర్గానికి అవసరమైన నిధులు, తదితర అంశాలపై చర్చించినట్లు ఎమ్మెల్యే రాధాకృష్ణ వెల్లడించారు.

# పసుమర్తి వారి వివాహ వేడుకలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా.



**సత్తుపల్లి, వజ్ర భారతి, మార్చి 5:** సత్తుపల్లిలోని సాయిబాలాజీ ఫంక్షన్ హాల్ లో జరుగుతున్న దమ్మపేటకి చెందిన పసుమర్తి వీరేశ్వరరావు వెంకట సంధ్యారాణి దంపతుల కుమార్తె వివాహ వేడుకలో అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో దారా యుగంధర్, దారా శ్రీను, రాంబద్రం, దారా శ్రీను తదితరులు ఉన్నారు.

# గుండె వాల్వ్ మార్పిడి క్లిష్ట చికిత్స విజయవంతం




**రాజమహేంద్రవరం, వజ్ర భారతి, మార్చి 5:(ఎండి నజీర్ అహ్మద్):** రాజమండ్రి: నగరంలోని పల్స్ ఆసుపత్రిలో 75 ఏళ్ల మహిళకు గుండె వాల్వ్ మార్పిడి క్లిష్ట చికిత్సను వైద్యులు విజయవంతంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఈ విధమైన ప్రత్యేక వాల్వ్‌తో చేసిన మొదటి చికిత్స ఇదేనని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. గుండె వాల్వ్ తీవ్రంగా సంకుచితమవడంతో పాటు ప్రధాన రక్తనాళంలో అధిక వంకర ఉండటంతో ఈ చికిత్స క్లిష్టంగా మారింది. ముందస్తు ప్రణాళిక, ఖచ్చితమైన పరీక్షలు మరియు వైద్య బృందం సమన్వయంతో ఈ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు. ఈ చికిత్సను కొల్లూరు లక్ష్మణ్, వంశీకృష్ణరాజు కోసూరు, సాజిత్ కిషన్ మరియు వైద్య బృందం నిర్వహించారు. ప్రస్తుతం అమర్చిన వాల్వ్ సక్రమంగా పనిచేస్తుందని వైద్యులు తెలిపారు. రోగిని 48 గంటల్లోనే ఆసుపత్రి నుంచి పంపించినట్లు వెల్లడించారు. రాజమండ్రి వంటి నగరంలో ఇలాంటి ఆధునిక గుండె చికిత్సలు అందించడం ఆనందంగా ఉందని ఆరోగ్య సేవల నిర్వాహకుడు గారపాటి శ్రీనివాస్ తెలిపారు.

# శంషాబాద్ లో వైభవంగా మల్లు వారి పెళ్లి సందడి

**హాజరైన రేవంత్ రెడ్డి మంత్రులు ,శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ మంత్రి దామోదర రాజు నరసింహం, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎస్సీ 57 కులాలు జాతీయ అధ్యక్షులు బైరు వెంకటేశ్వర్లు, తెలంగాణ మాల దాసరి కుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మల్లు ప్రసాద్,**





శంషాబాద్ మార్చి 5 : (వజ్రభారతి తెలుగు దినపత్రిక ప్రతినిధి) శంషాబాద్ జిఎంఆర్ ఏరినాలో జరిగిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క కుమారుడు సూర్య విక్రమాదిత్య వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులు శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ మంత్రి దామోదర రాజు నరసింహం, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఎస్సీ 57 కులాలు జాతీయ అధ్యక్షులు బైరు వెంకటేశ్వర్లు, తెలంగాణ మాల దాసరి కుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మల్లు ప్రసాద్, కార్యవర్గ సభ్యులు తుమ్మకొండ కొండయ్య కల్వకుర్తి నాగర్ కర్నూల్ అచ్చంపేట నుంచి ఖమ్మం తదితర ప్రాంతాల నుంచి వధూవరులను ఆశీర్వదించడానికి విచ్చేశారు.

**వైభవంగా విక్రమాదిత్య పెళ్లి వేడుకలు**

వైభవంగా మల్లు వారి పెళ్లి సందడి హైదరాబాద్‌లో మల్లు కుటుంబంలో పెళ్లి సందడి అట్టహాసంగా జరిగింది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కుమారుడు సూర్య విక్రమాదిత్య వివాహ వేడుక



అత్యంత వైభవంగా నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా వేదమంత్రాల నడుమ వధూవరులు వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. ఈ వేడుకను చూడటానికి వచ్చిన అతిథులకు ప్రత్యేక ఏర్పాట్లు చేసి పెళ్లిని ఘనంగా నిర్వహించారు. పెళ్లి కార్యక్రమం ముందు వరుడు సూర్య విక్రమాదిత్యను పల్లకిలో ఊరేగింపుగా తీసుకువచ్చారు. సంప్రదాయ సంగీతం, వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య పల్లకిలో వరుడి ఊరేగింపు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కుటుంబ సభ్యులు, బంధువులు ఆనందోత్సాహాలతో పాల్గొని వేడుకకు మరింత అందంగా చేకూర్చారు. ఈ వివాహ వేడుకకు జాతీయ స్థాయి ప్రముఖులు, రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పలువురు రాజకీయ, సామాజిక ప్రముఖులు హాజరయ్యారు. వారు వధూవరులను ఆశీర్వదించి భట్టి విక్రమార్క కుటుంబానికి శుభాకాంక్షలు తెలిపారు. వివాహ వేడుక సందర్భంగా ఏర్పాటు చేసిన అలంకరణలు, సాంప్రదాయ కార్యక్రమాలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. వివాహ కార్యక్రమం మొత్తం సంప్రదాయం, సంస్కృతి ప్రతిబింబించేలా నిర్వహించారు. అతిథులకు ప్రత్యేక విందు ఏర్పాట్లు చేసి ఆతిథ్యాన్ని అందించారు. కుటుంబ సభ్యులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై వధూవరులను ఆశీర్వదించారు. మొత్తంగా మల్లు కుటుంబంలో జరిగిన ఈ వివాహ వేడుక వైభవంగా, ఆనందోత్సాహాల నడుమ సాగి అందరినీ ఆకట్టుకుంది

# మంత్రి కందుల దుర్గేష్ చొరవతో సమిశ్రగూడెం శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయ పునర్నిర్మాణానికి రూ. 1.25 కోట్ల నిధులు మంజూరు

**గోదావరి పుష్కరాలు - 2027 నేపథ్యంలో పరిపాలన అనుమతులు జారీ చేసిన దేవాదాయ శాఖ**

**పుష్కరాలకు ముందే పనులు పూర్తి చేయాలని అధికారులకు మంత్రి ఆదేశం**

**నిడదవోలు, వజ్రభారతి, మార్చి 5:** రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రివర్యులు కందుల దుర్గేష్ ప్రత్యేక చొరవతో నిడదవోలు నియోజకవర్ నిడదవోలు రూరల్ మండలంలోని సమిశ్రగూడెం శ్రీ పర్వత వర్ధిని రామలింగేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధికి మార్గం సుగమమైంది. 2027లో జరగనున్న గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని ఉమ్మడి ప్రయోజన నిధి('కామన్ గుడ్స్ ఫండ్') క్రింద ఈ దేవాలయ పునర్నిర్మాణం కోసం రూ. 1.25 కోట్ల నిధులను మంజూరు చేస్తూ దేవాదాయ శాఖ పరిపాలన అనుమతులు జారీ చేసింది.

**పుష్కర యాత్రికుల సౌకర్యార్థం ప్రత్యేక చర్యలు:**

రాబోయే గోదావరి పుష్కరాల సమయంలో దేశవ్యాప్తంగా భక్తులు రాజమహేంద్రవరం మరియు పరిసర ప్రాంతాల్లోని పవిత్ర గోదావరి తీరానికి తరలివచ్చే అవకాశం ఉంది. భక్తులు స్నానం ఆచరించిన అనంతరం నదీ తీరంలోని పురాతన దేవాలయాలను దర్శించుకుంటారు. ఈ నేపథ్యంలో యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, దేవాలయాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు దేవాదాయ శాఖ ప్రత్యేక సర్వే నిర్వహించింది. ఈ సర్వే నివేదికల ఆధారంగా, అత్యంత ప్రాధాన్యత కలిగిన సమిశ్రగూడెం ఆలయ పునరుద్ధరణ మరియు ఫేస్‌లిఫ్ట్ పనుల కోసం మంత్రి కందుల దుర్గేష్ ప్రభుత్వంపై



ఒత్తిడి తెచ్చి త్వరితగతిన నిధులు మంజూరు చేయించారు.

**సకాలంలో పనులు పూర్తి చేయాలని ఆదేశం:**

నిధుల మంజూరుపై హర్షం వ్యక్తం చేసిన నియోజకవర్గ ప్రజలు మంత్రి దుర్గేష్ కు కృతజ్ఞతలు తెలిపారు. దీనిపై మంత్రి స్పందిస్తూ.. "పుష్కరాల నాటికి భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని పంచేలా ఆలయ రూపురేఖలు మార్చడమే మా లక్ష్యం. నిర్మాణ పనులను పుష్కరాల కంటే 4-5 నెలల ముందే పూర్తి చేసేలా అధికారులు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలి" అని ఆదేశించారు.



# గ్రామంలో నీటి అవసరతలకు ఎటువంటి ఇబ్బంది ఉండదు

**పెనుమంట్ర, వజ్రభారతి, మార్చి 05 :** మండల కేంద్రం లోని పెనుమంట్ర మేజర్ పంచాయతీ పరిధిలో అన్ని రకాల పన్నులు 75 శాతం మేరకు వసూళ్లు అయినట్టు మండలం డిప్యూటీ ఎంపీడివో వల్లభు రాంబాబు, పంచాయతీ అధికారి జి. బాలకృష్ణ గురువారం తెలిపారు. వేసవి కాలం సందర్బంగా గ్రామంలో ఉన్న అన్ని మంచినీటి చెరువులను నీటితో నింపడం పూర్తి అయ్యిందన్నారు. వెలమ పేట కాలనీ లో, నేలపోగుల ఎస్సి కాలనీలతో సహా అత్యవసరం అయిన అన్ని ప్రాంతాల్లో మంచి నీటి పైపు లైన్ లను రిపేర్ చేయించి నట్టు పేర్కొన్నారు. మార్చి నెల ఆఖరికి పంచాయతీ పరిధిలో పన్నులు వసూళ్ళు లో పూర్తి ప్రగతి సాధించడానికి సిబ్బంది ఫీల్డ్ లోకి వెళ్ళి పనిచేస్తున్నారని వారు తెలిపారు.

# మానవ హక్కుల పరిరక్షణ సంస్థ నియోజకవర్గ ఇన్చార్జి గా రామకృష్ణారెడ్డి



**పెనుమంట్ర, వజ్రభారతి, మార్చి 05 :** జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సంస్థ (ఎన్. హెచ్.ఆర్. పి) ఫోరం ఆచంట నియోజకవర్గం ఇంచార్జి గా మండలం లోని మార్టేరు కు చెందిన సీనియర్ జర్నలిస్ట్ వెలగల రా వ ు క్ృ ష్ణా ె ె డ్డి నియమితులు అయ్యారు.

గురువారం ఈ మేరకు సంస్థ చైర్మన్ జె.ఎన్.రామచంద్ర నాయుడు నుండి నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్బంగా వెలగల మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని అనుసరించి దేశ వ్యాప్తంగా మానవ హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయ స్థాపన, అణగారిన వర్గాల అభ్యున్నతి కలిగేలా కృషి చేస్తున్న సంస్థ లో ఇంచార్జి బాధ్యత ఇవ్వడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ స్థాయి లో ప్రజల్లో ప్రాథమిక హక్కులు, మానవ హక్కుల పట్ల అవగాహన కలిగించేందుకు వివిధ కార్యక్రమాల్ని నిర్వహిస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్బంగా పలువురు కూటమి నాయకులు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ఆయన్ని అభినందించారు.

# భారత ప్రభుత్వ వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ మార్చి 6న వర్చువల్ విధానంలో "వ్యవసాయం మరియు గ్రామీణ పరివర్తన" అంశంపై వెబినార్ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు



**భీమవరం: వజ్రభారతి, మార్చి 5:** వ్యవసాయ రంగ అభివృద్ధికి కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన కార్యక్రమాల అమలు రోడ్‌మ్యాప్‌పై చర్చించేందుకు భారత ప్రభుత్వ వ్యవసాయ ౘ రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ మార్చి 06, 2026న ఉదయం 10:00 గంటల నుండి వర్చువల్ విధానంలో "వ్యవసాయం మరియు గ్రామీణ పరివర్తన" అంశంపై బడ్జెట్ అనంతర వెబినార్ నిర్వహించనుంది. ఈ వెబినార్ ప్రారంభ సెషన్‌లో గౌరవ ప్రధానమంత్రి ప్రసంగించినట్లు తెలిపారు. అనంతరం వ్యవసాయ రంగానికి సంబంధించిన పలు కీలక అంశాలపై ప్రత్యేక సెషన్‌లు నిర్వహించబడతాయన్నారు. ముఖ్యంగా ఏఐ ఆధారిత డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వ్యవసాయం కోసం, వ్యవసాయ -- అటవీ వ్యవస్థల ప్రోత్సాహం, ఉద్యానవన అభివృద్ధి, వ్యవసాయం మరియు గ్రామీణ జీవనోపాధి బలోపేతం వంటి అంశాలపై చర్చలు ఉంటాయన్నారు. మొత్తం ఎనిమిది సెషన్‌లతో వెబినార్ కొనసాగతుందని, మొదటి సెషన్ వ్యవసాయ రంగంపై సమగ్ర దృష్టి సాధించేలా చర్చ ఉంటుందన్నారు. మిగతా సెషన్స్ లో వ్యవసాయ రంగంలోని ప్రత్యేక విభాగాలను కవర్ చేయడం జరుగుతుందన్నారు. ఉదయం 10:00 గంటల నుండి ప్రధానమంత్రి ప్రసంగం అన్ని సెషన్‌ల లింక్‌లలో ప్రత్యక్ష ప్రసారం అవుతుందని తెలిపారు. ఈ వెబినార్ లో ప్రాథమిక వ్యవసాయ రుణ సంఘాలు, సహకార సభ్యులు, రైతులు, ఇతర వాటాదారులు పెద్ద ఎత్తున పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. అవసరమైన చోట వెబినార్‌ను వీక్షించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు.



# గుప్త చిట్స్ అండ్ ఫైనాన్స్ పేరిట మోసం

## బాధితులకు న్యాయం చేయాలి

**మండపేట, వజ్రభారతి, మార్చి 5:** మండపేట మండలం తాపేశ్వరంలో గుప్త చిట్స్ అండ్ ఫైనాన్స్ పేరిట 13 మంది సభ్యులు కలిసి డిపాజిట్లు సేకరించి పరారై తమను మోసం చేశారని బాధితులు గ్రంధి సూర్య వెంకట ప్రకాశరావు,మద్దుల ఆనంద్, మాజేటి లక్ష్మీ నారాయణ ,పడాల కమాలా రెడ్డి,చక్కా వీరన్న,చక్కా శ్రీనివాస్ లు మీడియా వద్ద ఆవేదన వ్యక్తంచేశారు.గురువారం మండపేట సూర్య కన్వెన్షన్ ప్రాంగణంలో మాట్లాడారు. రూరల్ పోలీస్ స్టేషన్లో డిపాజిట్ యాక్ట్ చట్టం కింద కేసు నమోదు చేశారని 3నెలలైనా ఇప్పటికీ ఎవరినీ అదుపులోకి తీసుకోలేదన్నారు. సుమారు రూ.8కోట్లు మేర మోసం చేసారన్నారు. పరారీలో ఉన్న చక్కా వీరవెంకట సతీష్, సూర్యకళ లను విజయవాడ సమీపంలోని కపోరంగిలో బాధితులమైన మేము పట్టుకోని పెనమలూరు పోలీస్ స్టేషన్లో అప్పగించమన్నారు. ఇదంతా బాధితులైన మేమే చేసాం తప్ప పోలీసులు ఏమి చేయలేదన్నారు. మిగిలిన 11 మంది సభ్యులు మండపేటలో యదేచిగా తిరుగుతున్నారని మమ్మల్ని మీరు ఏమి చేయలేరు అన్నట్టుగా ఉందన్నారు ఈరోజు వరకు కూడా ఎవరికైనా కేసులు కట్టలేదన్నారు. పోలీసులు వారిపై చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

# తూర్పు విప్పర్రు గ్రామంలో అక్రమ బాణాసంచా నిల్వలపై పోలీసుల దాడులు.

**అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు రూ 30,385 విలువైన బాణాసంచా స్వాధీనం.**





**ఇరగవరం, వజ్రభారతి, మార్చి 5:** కాకినాడ జిల్లా వేట్లపాలెం బాణాసంచా తయారీ కేంద్రంలో చోటుచేసుకున్న ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకుని, పశ్చిమగోదావరి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, ఐపీఎస్ ఆదేశానుసారం జిల్లా వ్యాప్తంగా బాణాసంచా తయారీ విక్రయ కేంద్రాలపై పోలీసు యంత్రాంగం నిఘాను తీవ్రతరం చేసింది. ఈ క్రమంలో, తణుకు రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ దేశంశెట్టి వెంకటేశ్వరరావు ఇరగవరం ఎస్సై జె. సతీష్ కి అందిన విశ్వసనీయ సమాచారం మేరకు, ఇరగవరం మండలం తూర్పు విప్పర్రు గ్రామంలో పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ దాడుల్లో మామిడిశెట్టి శ్రీనివాస్ అనే వ్యక్తి, ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా నివాస ప్రాంతంలో అత్యంత ప్రమాదకర రీతిలో అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు రూ 30,385 విలువైన బాణాసంచాను పోలీసులు గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. ఈ అక్రమ నిల్వలకు సంబంధించి నిందితుడిపై క్రైమ్ నెంబర్: 43/2026, యు/ఎస్ 288 బి ఎం ఎస్ మరియు 9(బి)(1)(బి) ఎక్స్ప్లోజివ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు. ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించే విధంగా నివాస ప్రాంతాలలో నిబంధనలకు విరుద్ధంగా బాణాసంచా తయారు చేసినా లేదా నిల్వ ఉంచినా అటువంటి వారిపై కఠినమైన క్రిమినల్ చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని ఆయన పేర్కొన్నారు. నిబంధనల ఉల్లంఘనపై ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించే ప్రసక్తే లేదని హెచ్చరిస్తూ, ఎక్కడైనా అక్రమ బాణాసంచా తయారీ లేదా నిల్వల గురించి సమాచారం తెలిస్తే తక్షణమే సమీప పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేయాలని ఈ సందర్భంగా పోలీసు అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# తణుకు నియోజకవర్గంలో తాగునీటికి ప్రాధాన్యత

**రూ. 54 కోట్లు నిధులతో తాగునీటి పథకాలు**

**11 వాటర్ ట్యాంకులు, పైపు లైన్లు విస్తరణకు చర్యలు**

**తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ వెల్లడి**

**తణుకు, వజ్రభారతి, మార్చి 05:** తణుకు నియోజకవర్గంలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేసి నేరుగా గోదావరి జలాలు అందించడానికి ప్రణాళికలు చేస్తున్నామని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. అమరజీవి జలధార పథకం కింద దాదాపు 300 కిలోమీటర్లు మేర పైపు లైన్లు నిర్మించి రూ. 20 కోట్లు పైగా నిధులు వెచ్చించడానికి చర్యలు చేపట్టామన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నియోజకవర్గంలోని తణుకు, ఇరగవరం, అత్తిలి మండలాల్లో కుళాయిలు, వాటర్ ట్యాంకుల నిర్మాణానికి మొత్తమ్మీద రూ. 54 కోట్లు పైగా నిధులు ఖర్చు చేయడానికి ప్రణాళికలు చేస్తున్నట్లు వెల్లడించారు. అత్తిలి మండలంలో అత్తిలి, ఆరవల్లి గ్రామాల్లో 90, 40 కిలో లీటర్ల సామర్థ్యం కలిగిన బాటర్ ట్యాంకుల నిర్మాణానికి రూ. 35.50 లక్షలు కేటాయించామన్నారు. ఇరగవరం మండలం తూర్పువిప్పర్రులో రూ. 19.63 లక్షల వ్యయంతో 30 కిలో లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంకు,



ఏలేటిపాడులో రూ. 14. 25 లక్షలతో 20 కిలో లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంకు, యర్రాయిచెరువులో రూ. 14. 25 లక్షల వ్యయంతో 20 కిలో కిలోలీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంకు, కత్తవపాడులో రూ. 25.91 లక్షల వ్యయంతో 60 కిలో లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంకు, రేలంగి చుక్కావారితోటలో రూ. 14.25 లక్షలతో 20 కిలో లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంకు, అంతెనవారిపాలెంలో రూ. 14.25 లక్షలతో రూ. 20 కిలో లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంకు, చీలివారిపేటలో రూ. 11.05 లక్షల వ్యయంతో 10 కిలో లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంకు, కేతావారిపాలెంలో రూ. 14.25 లక్షల వ్యయంతో 20 కిలో లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంకుతోపాటు తణుకు మండలం దువ్వలో రూ. 35.59 లక్షల వ్యయంతో 90 కిలో లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంకు నిర్మాణానికి చర్యలు చేపట్టామన్నారు. మొత్తం 11 వాటర్ ట్యాంకులను నిర్మించడానికి 10 చోట్ల స్థల సేకరణ చేసి ఆరు చోట్ల పనులు ప్రారంభించినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నియోజకవర్గ ప్రజలకు తాగునీటి సరఫరా ఇబ్బందులు రానీయకుండా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్కల్యాణ్ సహకారంతో అమరజీవి జలధాన పథకం ద్వారా నిధులను సమీకరించినట్లు వెల్లడించారు. త్వరలోనే ఈ పథకాలు ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే రాధాకృష్ణ వెల్లడించారు.

# ఘనంగా జాతీయ మహిళా దినోత్సవం

**పాలకొల్లు, వజ్రభారతి, మార్చి 5:** జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీ ఏ.ఎస్.ఎన్.ఎం. ప్రభుత్వ (స్వయం ప్రతిపత్తి) కళాశాల, పాలకొల్లు నందు మహిళా సాధికారత విభాగం, ఎన్.ఎస్.ఎస్. యూనిట్ వన్, టు పాలకొల్లు టౌన్ పోలీస్ స్టేషన్ వారి సంయుక్త ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థుల కోసం "మహిళా సాధికారత సమాజ అభివృద్ధికి పునాది" అనే అంశంపై వక్తృత్వశీ (ఎలొక్యూషన్) మరియు " డిజిటల్ యుగంలో మహిళల అవకాశాలు మరియు సవాళ్లు" అనే అంశంపై వ్యాసరచన పోటీలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డా. టి. రాజరాజేశ్వరి అధ్యక్షత వహించి మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని, మహిళా సాధికారతతోనే సమానత్వం, అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. మహిళలపై అవగాహన పెంపొందించడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాలకొల్లు టౌన్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రజనీ కుమార్ మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం భారతదేశంలో అమల్లో ఉన్న వివిధ చట్టాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. గృహ హింస నిరోధక చట్టం 2005, కార్యాలయాలలో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం -- 2013, బాల్యవివాహ నిషేధ చట్టం -- 2006 వంటి ముఖ్యమైన చట్టాలను వివరించారు. మహిళలు తమ హక్కులను తెలుసుకొని ఎలాంటి అన్యాయం జరిగినా



భయపడకుండా పోలీసులను సంప్రదించాలని సూచించారు. మహిళల భద్రత కోసం పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని ఆయన తెలిపారు. మహిళలు విద్య, ఉపాధి మరియు నాయకత్వ రంగాల్లో ముందుకు రావాలని సూచించారు.ఎస్.ఐ. ప్రసాద్ మాట్లాడుతూ మహిళల భద్రత కోసం పోలీస్ శాఖ అందిస్తున్న సేవలను వివరించారు. మహిళలు ఏదైనా వేధింపులు లేదా సమస్యలు ఎదుర్కొన్నప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, ప్రభుత్వం అందిస్తున్న హెల్ప్లైన్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. మహిళలు ధైర్యంగా ముందుకు వచ్చి తమ హక్కులను కాపాడుకోవాలని ఆయన వివరించారు.ఈ సందర్భంగా నిర్వహించిన వక్తృత్వ మరియు వ్యాసరచన పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని మహిళా సాధికారత, సమాజంలో మహిళల పాత్ర, మహిళల హక్కులు వంటి అంశాలపై తమ అభిప్రాయాలను



వ్యక్తపరిచారు. ఉత్తమంగా ప్రదర్శన కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ టి.కృష్ణ, ఐ క్యు ఏసి కోఆర్డినేటర్ కె భద్రాచలం, ఎకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ వి యామిని,తెలుగు విభాగాధిపతి డా. భూసి వెంకటస్వామి, మహిళా సాధికారత విభాగం కన్వీనర్ బి.కె.వి. రామలక్ష్మి, ఎన్ఎస్ఎస్ యూనిట్ వన్ ప్రోగ్రాం ఆఫీసర్ డా.వి.డి. వి.విజయ లక్ష్మి, మహిళా సాధికారత విభాగం సభ్యులు కే స్వర్ణలత,పి జోష్ణ శ్రీ,డి హెప్సిరాణి, వి శిరీష, ఎం శిరీష, పి దుర్గేశ్వరి, ఇతర అధ్యాపక సిబ్బంది మరియు విద్యార్థిని విద్యార్థులు, ఏఎస్ఐ మార్లింగం,మహిళా పోలీసులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# చలో విజయవాడ విజయవంతం -- జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్.వి. అప్పారావు

**జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ఉద్యమం అవసరం**

**జీలుగుమిల్లి (వజ్రభారతి) ఏలూరు జిల్లా ఇంచార్జ్ మార్చి05:** జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 4న నిర్వహించిన చలో విజయవాడ కార్యక్రమం విజయవంతమైందని ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎన్.వి. అప్పారావు తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోరుతూ విజయవాడ నడిబొడ్డున జర్నలిస్టుల గొంతుతో నగరం దద్దరిల్లిందన్నారు. అనంతరం నిర్వహించిన సభకు సమాచార శాఖ మంత్రి పార్థసారథి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెంకట్రావు అధ్యక్షతన జరిగిన సభలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. ఆంజనేయులు రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జర్నలిస్టుల




న్యాయమైన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. సేవ్ జర్నలిజం, ప్రొటెక్ట్ జర్నలిస్ట్ నినాదానికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని ఆయన పేర్కొన్నారు.జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యేలు నందమూరి బాలకృష్ణ, పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ముందుకు రావడం సభలో ప్రస్తావనకు వచ్చిందన్నారు. స్థానిక ఎమ్మెల్యే బాలరాజు ఇచ్చిన హామీ మేరకు జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని అప్పారావు కోరారు. రానున్న రోజుల్లో జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం జరిగే ఉద్యమాలకు చలో విజయవాడ మరింత బలం చేకూర్చిందని ఆయన అన్నారు. జర్నలిస్టుల ఐక్యత ద్వారానే సమస్యలకు పరిష్కారం సాధ్యమవుతుందని తెలిపారు.ఈ ప్రకటన విడుదల చేసిన వారిలో జిల్లా కమిటీ సభ్యులు బొంతు రామారావు, పోలవరం నియోజకవర్గ అధ్యక్షులు కొప్పుల చిన్నసాయి, మండల అధ్యక్షులు చిట్టిబొమ్మ శ్రీను లోకేష్ తదితరులు ఉన్నారు.

# రూ,,300 కే జనసేన సభ్యత్వం నమోదు..జనసేన మహిళా నాయకురాలు సిగిలి సీత

**పోలవరం మార్చి 5 (వజ్ర భారతి):** పోలవరం జనసేన మండల అధ్యక్షుడు గునపర్తి చిన్ని, మండల ఉపాధ్యక్షులు తెలగంశెట్టి రాంప్రసాద్ సూచనలతో జనసేన సభ్యత్వ నమోదుకు తమ వంతు సహాయంగాఒక్కో సభ్యత్వం పై వంద రూపాయలు తగ్గించి సభ్యత్వ నమోదు చేయడం జరుగుతుందని తమ దగ్గర సభ్యత్వం నమోదు చేయించుకునే వందమంది వరకు ఈ వెసులుబాటును కల్పించడం జరుగుతుందని జనసేన మహిళా నాయకురాలు సిగిలి సీత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో సభ్యత్వం నమోదుకు జనసేన పార్టీ అధిష్టానం 500 రూపాయలు గా ఉన్న నమోదుకు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రస్తుతం సభ్యత్వం నమోదు చేయించుకునే వారికి 100 రూపాయలు తగ్గించడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా తమ వంతుగా తమ దగ్గర సభ్యత్వం నమోదు చేయించుకునే వారికి అదనంగా మరో వంద రూపాయలు తగ్గించి 300 రూపాయలకు జనసేన సభ్యత్వం నమోదు చేయడం జరుగుతుందని నమోదు కోసం 9703136782 సంప్రదించాలని ఆమె తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. జనసేన సభ్యత్వం నమోదు చేయించుకున్న వారికి ప్రమాదవశాత్తూ మరణం సంభవిస్తే 5 లక్షల బీమా వర్తిస్తుందని,ప్రమాదవశాత్తూ రెండు కళ్ళు లేదా చేతులు లేదా కాళ్ళు కోల్పోయినా, లేదా ఒక కన్నుతో పాటు ఒక చేయి లేదా కాలు కోల్పోయిన పరిస్థితుల్లో 5 లక్షల బీమా వర్తిస్తుందన్నారు.ప్రమాదవశాత్తూ ఒక కన్ను లేదా ఒక చెయ్యి లేదా ఒక కాలు కోల్పోయినట్లయితే 2.5 లక్షల వరకు బీమా వర్తిస్తుందన్నారు.ప్రమాదవశాత్తూ పూర్తి వైకల్యం కలిగిన పక్షంలో 5 లక్షల ప్రమాద బీమా అందించబడుతుందన్నారు. ఏ పార్టీలోను లేనివిధంగా పార్టీ అధిష్టానం జనసేన పార్టీ కార్యకర్తలకు భవిష్యత్తుకు బీమా భరోసా కల్పించడం జరిగిందని ఆమె పేర్కొన్నారు.





## కొయ్యలగూడెంలో జేష్ఠ రామకృష్ణ కుమారుడి వివాహ వేడుకలు

**వివాహ వేడుకలకు హాజరైన ఏపీ స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి దంపతులు**

**కొయ్యలగూడెం (వజ్రభారతి) ఏలూరు జిల్లా ఇంచార్జ్ మార్చి05:** కొయ్యలగూడెం గ్రామానికి చెందిన రాష్ట్ర టీడీపీ సీనియర్ నాయకులు జేష్ఠ రామకృష్ణ కుమారుడి వివాహ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ వివాహ వేడుకలకు ఏపీ స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ శ్రీమతి కొవ్వాసు జగదీశ్వరి దంపతులు ప్రత్యేకంగా హాజరయ్యారు.వధూవరులను ఆశీర్వదిస్తూ వారు శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా కొంతసేపు గడిపారు. వివాహ వేడుకల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.అతిథులను ఆతిథ్యంతో స్వాగతించిన జేష్ఠ రామకృష్ణ కుటుంబ సభ్యులు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరిగింది.

## బార్" ను వేరే ప్రాంతానికి తరలించాలి



**రాజమహేంద్రవరం, వజ్రభారతి , మార్చి 5:(ఎండి నజీర్ అహ్మద్):** కొంతకాలంగా గేదెల నూకరాజు కళ్యాణ మండపంలో బారు ఏర్పాటు చేయవద్దంటూ ప్రజా సంఘాల ఆందోళన నిర్వహిస్తున్న ప్రభుత్వ అధికారులు పట్టించుకోకుండా గురువారం నూతనంగా బార్ ఏర్పాటు చేశారు. నూతనంగా ఏర్పాటు చేసిన బార్ ను వెంటనే వేరే ప్రాంతానికి తరలించాలని కోరుతూ మహిళా సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగాయి. రాజమండ్రి ఆల్కట్ గార్డెన్స్ లో ఉన్న గేదెల నూకరాజు కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన బార్ ను వేరే ప్రాంతానికి తరలించాలని కోరుతూ మహిళా సంఘాలు ఆందోళన నిర్వహించారు. హూమన్ రైట్స్ ప్రొడక్షన్స్ సొసైటీ నాయకురాలు ఎల్లమెల్లి ఝాన్సీ కేతపల్లి సీతామాలక్ష్మి మాట్లాడుతూ రాజమండ్రి ఆల్కట్ గార్డెన్ లో గల గేదెల నూకరాజు కళ్యాణ మండపంలో "బార్" పెట్టేందుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడం దారుణమని అన్నారు. ప్రజల నివాసస్థలంలో బార్ కి అనుమతి ఇవ్వడం వలన ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆ ప్రాంతం అంతా బ్లేడ్ బేచ్, పిక్ పాకెటర్స్, గంజాయి సేవించే వారు ఎక్కువగా తిరుగుతూ తరచూ గొడవలు జరుగుతాయని తెలిపారు. రాత్రి సమయాలలో దొంగతనాలు జరిగే ప్రదేశమని వివరించారు. ప్రభుత్వం ఆ ప్రాంతంలో బార్ ఏర్పాటు చేయడం వలన ప్రమాదాలకు దారి తీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. గేదెల నూకరాజు కళ్యాణమండపంలో బార్ ను వేరే ప్రాంతానికి తరలించుకుంటే మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా మహిళా సంఘాలు నూతనంగా ఏర్పాటు చేసిన వారు వద్ద ఆందోళన నిర్వహించారు.

## రాష్ట్రస్థాయి జర్నలిస్టుల సమావేశంలో ఎమ్మెల్యే చిర్రి బాలరాజుపై ప్రశంసలు

**జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం తీసుకుంటున్న చర్యలను అభినందించిన సంఘాల నాయకులు**

**జీలుగుమిల్లి (వజ్రభారతి) ఏలూరు జిల్లా ఇంచార్జ్ మార్చి05:** విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బుధవారం నిర్వహించిన ఏపీడబ్ల్యూజేఎఫ్ చలో విజయవాడ కార్యక్రమంలో పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పనితీరుపై రాష్ట్రస్థాయి జర్నలిస్టు సంఘాల నాయకులు ప్రశంసలు కురిపించారు. రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన జర్నలిస్టుల సమక్షంలో ఎమ్మెల్యే చేపడుతున్న కార్యక్రమాలను సభ వేదికపై ప్రత్యేకంగా ప్రస్తావించారు. రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య అయిన సొంత ఇంటి కలను నెరవేర్చే దిశగా ఎమ్మెల్యే చిర్రి బాలరాజు తీసుకుంటున్న చర్యలను వారు అభినందించారు. ముఖ్యంగా జీలుగుమిల్లి ప్రాంతంలో విలేకరులకు ఇళ్ల స్థలాల పంపిణీ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లేందుకు ఆయన చూపుతున్న చొరవను ప్రశంసించారు.రాష్ట్రస్థాయిలో హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తర్వాత జర్నలిస్టుల సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, వారి సొంత ఇంటి కల నెరవేర్చేందుకు ఇళ్ల స్థలాల పంపిణీ పనిని ముమ్మరం చేస్తున్న నాయకుడిగా పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజును సంఘాల నాయకులు కొనియాడారు.ఈ సందర్భంగా సభలో పాల్గొన్న జర్నలిస్టులు, సంఘాల ప్రతినిధులు ఎమ్మెల్యే చిర్రి బాలరాజు చేపడుతున్న కార్యక్రమాలకు హర్షం వ్యక్తం చేశారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం ఆయన చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు.త్వరలోనే అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసే దిశగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు హామీ ఇచ్చినట్లు తెలిపారు.



# మహిళల ఉపాధిని దెబ్బతీసే వి.బి.జి. రామ్ జి పథకాన్ని వ్యతిరేకించండి

## ప్రగతిశీల మహిళా సంఘం పిఓడబ్ల్యు పాల్వంచ డివిజన్ కార్యదర్శి తోడం దుర్గమ్మ



దమ్మపేట, వజ్రభారతి, మార్చి 5: దమ్మపేట మండల కేంద్రంలో,2026 అంతర్జాతీయ మహిళా పోరాటం సందర్భంగా టి ఓ డబ్ల్యు పిలుపు మేరకు గురువారం దమ్మపేటలో పిఓడబ్ల్యు మండల కమిటీ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో తోడం దుర్గమ్మ మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా పోరాట దినం మార్చి 8 అంటే దీనికి కొంత ప్రాధాన్యత వుంది. ఒక చారిత్రిక పోరాటాల నేపథ్యం వుంది. కానీ ఇదోక పండుగ కాదు. సన్మానాలు, సంబరాలు చేసుకోవటం అంతకంటే కాదని అన్నారు న్యూయార్క్ నగరంలో పరిశ్రమల్లో పనిచేసే మహిళా కార్మికులు పని గంటల తగ్గింపుకూ, శ్రమదోపిడీకి వ్యతిరేకంగా, వేతనాలు పెరుగుదల కోసం పోరాడి హక్కులు సాధించుకున్న రోజు, హక్కుల సాధన కోసం మహిళలు రక్తతర్పణలు చేసిన రోజు, 1908 మార్చి 8ను ప్రపంచ మహిళల పోరాట దినంగా జరుపుకోవాలని 1910 సం॥ము కోపెన్ హెగెన్లో జరిగిన మహాసభలో జర్మనీ కమ్యూనిస్టు పార్టీ నా యకురాలు క్వారా జర్కిన్ ప్రతిపాదించి ఆమోదింప చేశారని అన్నారు ఈనాడు ఒక దేశంలోనే కాదు ప్రపంచ వ్యాపితంగా యుగాలు మారినా, తరాలు మారినా మారనిది మహిళల తలరాతలే, అసమానత్వం, అణచివేత, వివక్ష పురుషాధిక్కృత వంటి సమస్యలు సమసి పోలేదు, మహిళా లోకం ఎదుర్కొంటున్న సమస్యల । పరిష్కారం కోసం ముందుకు సాగటమే మార్చి 8 సందర్భంగా మనం కర్తవ్యాన్ని దృఢంగా కొనసాగించటం.మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో కార్మికవర్గం, ప్రజల, మహిళల సమస్యలు మరింతగా పెరిగాయి. వీరి హక్కులపై దాడికి పూనుకుంది. కార్మిక చట్టాలను రద్దు చేసింది. నాలుగు లేబర్ కోర్స్ మార్చి హక్కులను హరించి వేసింది. వ్యవసాయ రంగం, పారిశ్రామిక రంగం, అసంఘటిత రంగం, సంఘటిత రంగాల్లో దాదాపు 50 శాతం మంది పనిచేస్తున్నారు. ఉద్యోగ, ఉపాధి భద్రతలేదు. వేతనాల్లో వివక్ష ఎదుర్కొంటున్నారు. సమాన పనికి సమాన వేతన చట్టం వచ్చి దశాబ్దాలు గడిచాయి. సుప్రీం కోర్టు ఆదేశాలిచ్చినా పాలకులు ఖాతరు చేయటం లేదని గత పది సం లుగా బీజేపీ, మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల నేపథ్యమే మహాత్మాగాంధీ ఉపాధి హామీ చట్టం పేరు మార్చటం. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యంగా వి.బి.జీ. రామ్ పథకాన్ని పార్లమెంట్లో ఆమోదించింది. ఉపాధి । హామీ చట్టాన్ని ఎందుకు రద్దు చేశామంటే లోపాలున్నాయని పాలకులు సమర్థించుకుంటున్నారని లోపాలు సరిచేయాలి గానీ రద్దు చేయటం పరిష్కారం కాదని అన్నారు ఈ చట్టం 2005లో వచ్చింది. ఈ చట్టం ద్వారా ఉపాధి లేని పేదలకూ, వృద్ధులకూ, వికలాంగులకూ, నైపుణ్యం లేని వారికి పని హక్కును కల్పించింది. ఉపాధి కూలీలుగా పనిచేస్తున్న వారిలో 60 శాతం మంది మహిళలే వున్నారు. ఈ చట్టం ద్వారా పని కల్పించమని డిమాండ్ చేసే హక్కు ప్రజలకు వచ్చింది. అంతేగాకుండా ఇందులో పనిచేసే మహిళా కూలీలకు సమాన పనికి సమాన వేతన చట్టం అమలవుతుంది. ఉపాధి కోసం ఇతర చోట్లకు పోకుండా స్థానికంగా పనిచేసే అవకాశం వుంది. పని కల్పించక పోతే భృతి కల్పించమనే హక్కు వుందని ఉపాధి దొరకటం వల్ల పేదరికంలో వున్న వారికి వచ్చే ఆదాయం కుటుంబ అవసరాలకు కొంత ఉపయోగపడుతోంది. ఇటువంటి చట్టాన్ని రద్దు చేయటమంటే ప్రజల ప్రాథమిక హక్కుపై దాడి చేయటమే, మోడీ ప్రభుత్వం 2025 డిసెంబర్లో తెచ్చిన వి.బి.జి. రామ్జి పథకం ద్వారా 125 రోజులు పని కల్పిస్తున్నామని తెగ చెప్పుకుంటోంది. అదే సమయంలో వ్యవసాయ సీజన్లో 60 రోజులు మినహాయించడం వలన ఆ సమయంలో కూలీలకు డిమాండ్ తగ్గి తక్కువ వేతనాలకు పనిచేయాల్సిన స్థితి ఏర్పడుతుంది..ఈ పథకం ద్వారా పని కల్పించమని డిమాండ్ చేసే హక్కు హరించబడుతోంది. కేంద్ర ప్రభుత్వం కేటాయించిన బడ్జెట్ వరకే పనులు చేయాల్సి వస్తున్నది. పనులకు తగ్గ బడ్జెట్ అడిగే అవకాశం, అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు లేదు. పనులు కూడా కేంద్రమే నిర్ణయిస్తుంది. ఫలితంగా ఉపాధి పనులు కుదించటానికి దారి తీస్తుంది. పేదలు ఉపాధి కోల్పోతారు. కేంద్ర బడ్జెట్లో దాదాపు 15 శాతం రెండు తెలుగు రాష్ట్రాల్లోనే ఖర్చవుతుంది. 2024-25 ఆర్థిక సం లో ఉపాధి హామీ చట్టం కోసం సుమారు 2,500 కోట్లు ఖర్చయితే ఇందులో రాష్ట్రాల వాటా 1200 కోట్లు మాత్రమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో కోండ్రు లక్ష్మి తెల్లం బంగారమ్మ గంగాధర నాగమణి, అఖిలభారత ఐక్య రైతు సంఘం మండల కార్యదర్శి పండూరి వీరబాబు తదితరులు ప్రసంగించారు.

## ఒమ్మంగి గ్రామంలో శ్రీ సత్తెమ్మతల్లి అమ్మవారి మహోత్సవాల్లో పాల్గొన్న ముదునూరి మురళీకృష్ణం రాజు

**అన్నదానానికి రూ.10,000 విరాళం**



**ప్రత్తిపాడు,వజ్రభారతి,ప్రతినిధి,స్టేట్ బ్యూరో,మార్చి, 5:** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం పత్తిపాడు మండలం ఒమ్మంగి గ్రామంలో నిర్వహిస్తున్న శ్రీ సత్తెమ్మతల్లి అమ్మవారి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, నరసాపురం పార్లమెంట్ పరిశీలకులు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణ రాజు మహోత్సవాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయంలో జరుగుతున్న ఉత్సవాలను దర్శించిన అనంతరం గ్రామంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి ముదునూరి మురళీకృష్ణం రాజు రూ.10,000 నగదు విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దేవస్థానం కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేసి సత్కరించారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా మురళీకృష్ణం రాజు మాట్లాడుతూ గ్రామాల్లో జరుగుతున్న దేవాలయ మహోత్సవాలు ప్రజల ఐక్యతను, సంప్రదాయాలను, సంస్కృతిని నిలబెట్టే పండుగలని తెలిపారు. అమ్మవారి కృపతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. భక్తి భావంతో నిర్వహించే ఇలాంటి ధార్మిక కార్యక్రమాలకు తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని ఆయన తెలిపారు. అలాగే గ్రామాల్లో జరిగే దేవాలయ ఉత్సవాలు యువతలో భక్తి భావాన్ని పెంపొందించడంతో పాటు సమాజంలో ఐక్యతను బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. అన్నదానం మహాదానం అని పురాణాల్లో చెప్పినట్లుగా భక్తులకు ఆహారం అందించడం గొప్ప సేవ అని ఆయన అన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలకు ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ తరఫున సహాయం అందిస్తామని ఆయన వెల్లడించారు.ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు గంట గంగబాబు, తోలేటి శేఖర్, ముమ్మిడి వీరబాబు, గంట లచ్చబాబు (బుజ్జి), సుంకర తమ్మారావు, గంట చిట్టిబాబు, శైలు నాగేశ్వరరావు, నార్లంక చక్రరావు, నార్లంక వెంకన్నబాబు, అర్జంపూడి రాంబాబు, కొప్పన సత్తిబాబు, చెవల వెంకన్న, గంట పండు, కోలుమాటి చిన్ని, షేక్ సత్తిబాబు, ఎంపీటీసీ నానిపల్లి చంటి, కోలా తాతబాబు, కోలా సూరిబాబు, దాడి పుత్తయ్య తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.మహోత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అమ్మవారి సేవలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని భక్తులు తెలిపారు. దేవాలయ కమిటీ సభ్యులు మహోత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళ దినోత్సవ వేడుకలు

**ఏలేశ్వరం,వజ్రభారతి,ప్రతినిధి,స్టేట్ బ్యూరో,మార్చి, 5:-** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఐసిడిఎస్ సిడిపిఓ పద్మావతి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా అవగాహన కార్యక్రమము చేపట్టారు.మహిళల మరియు బాలికల హక్కులు సమానత్వం సాధికారిత న్యాయ అవగాహనపై 20 రోజుల కార్యక్రమంలో భాగంగా చేపట్టిన కార్యక్రమంలో పలువురు ప్రముఖులు హాజరయ్యారు.ముఖ్యంగా ప్రస్తుత సమాజంలో మహిళలు తెలుసుకోవలసిన విషయాలపై అవగాహన కల్పించారు.విద్య,న్యాయస్థానము, చట్టం ఆరోగ్యం తదితర అంశాలపై విద్యార్థులు మహిళలకు ఆయా శాఖల అధికారులు వివరించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన క్రీడలలో నైపుణ్యం కలిగిన విద్యార్థులకు ప్రముఖుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.వివిధ రంగాలలో విధులు నిర్వహిస్తున్న మహిళా మణులను ఐసిడిఎస్ సిడిపిఓ పద్మావతి మహిళా దినోత్సవ సందర్భంగా ప్రత్యేక సన్మానం ద్వారా సత్కరించారు.ఈ సందర్భంగా ఐసిడిఎస్ సిడిపిఓ పద్మావతి,డాక్టర్ సౌభాగ్య సరోజ మాట్లాడుతూ ముందుగా మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.బాల్య దశలో చైల్డ్ మ్యారేజ్ లకు ఎవరూ పాల్పడు కాదని సూచించారు.మహిళలు అన్ని రంగాలలో ముందుండాలని కోరారు.విద్యార్థి దశ నుంచే సమాజాన్ని చదవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చిక్కాల రాజ్యలక్ష్మి, ప్రముఖ న్యాయవాది బుగతా శివ, డాక్టర్ సౌభాగ్య సరోజ, ఎంఈఓ వరలక్ష్మి, ఐసిడిఎస్ సూపర్వైజర్ సూర్య కుమారి,కళాశాల వైస్ ప్రిన్సిపల్,మెప్మా మేనేజర్ ప్రసాద్,ఆరోగ్య సిబ్బంది ఐ సి డి ఎస్ సిబ్బంది,పలువురు విద్యార్థినీ విద్యార్థులు,మహిళలు పాల్గొన్నారు.



# 10వ తరగతి పరీక్షలను పగడ్బందీగా నిర్వహించండి:- కలెక్టర్ సిరి.

## విద్యార్థులు సమయానికి పరీక్ష కేంద్రంలో ఉండాలి. కలెక్టర్.



**కర్నూల్ మర్చి 5, వజ్రభారతి ( జిల్లా ఇంచార్జి పద్మావతి ) :** ఈనెల 16వ తేదీ నుంచి ఏప్రిల్ ఒకటో తేదీ వరకు జిల్లాలో జరగబోయే పదో తరగతి పరీక్షలను అధికారులు పగడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి అన్నారు. గురువారం కర్నూలులోని కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో పదో తరగతి పరీక్షలపై విద్యాశాఖ అధికారులతో సమీక్ష చేశారు. జిల్లా వ్యాప్తంగా 160 పరీక్ష కేంద్రాలలో అన్ని వసతులను ఒకరోజు ముందుగానే పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులో ఉంచాలన్నారు. విద్యార్థులు ఎక్సమ్ సమయానికి అరగంట ముందే పరీక్ష కేంద్రం లో ఉండాలని అన్నారు.

# కాకినాడ సెజ్ భూములు రైతులకు తిరిగి అప్పగింపు -- అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి..

## జిల్లా కలెక్టర్ షణ్మోహన్




**కాకినాడ,వజ్రభారతి,ప్రతినిధి,స్టేట్ బ్యూరో,మార్చి, 5:-** కాకినాడ జిల్లాలో సెజ్‌కు చెందిన భూములను తిరిగి రైతుల పేర్లపై రిజిస్ట్రేషన్ చేసి ఆయా రైతులకు అప్పగించే ప్రక్రియ కొనసాగుతున్నదని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి తెలిపారు. గురువారం కాకినాడ కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ తో కలిసి రెవెన్యూ, సెజ్, రిజిస్ట్రేషన్ ఇతర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ.. కాకినాడ రూరల్, యు. కొత్తపల్లి, తొండంగి మండలాల పరిధిలో భూమిని సెజ్ పరిధిలోకి తీసుకోవడం జరిగిందన్నారు. ఈ భూములను అర్హత గల రైతుల వారి పేర్లపై తిరిగి రిజిస్ట్రేషన్ చేయించే చర్యలను ప్రభుత్వం చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ భూములకు సంబంధించి ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ ప్రత్రాలపై స్టాంప్ డ్యూటీ మరియు రిజిస్ట్రేషన్ ఫీజులు పూర్తిగా మినహాయింపు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని రైతులందరు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. రైతులు తమ భూములు సంబంధించిన పట్టాదారు పాస్ పుస్తకాలు, దస్తావేజులు, ప్రభుత్వం నిర్వహించిన రీ సర్వే నోటీసుల వివరాలు అన్ని మార్చి 13 నాటికి ఆయా మండలాల తహశీల్దార్ల కార్యాలయంలో సమర్పించాలన్నారు. సెజ్ భూములు రిజిస్ట్రేషన్ ప్రక్రియకు సంబంధించి రెవెన్యూ, సెజ్, రిజిస్ట్రేషన్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి సెజ్ భూములు రైతులు పేరును బదిలీ చేసే ప్రక్రియ సజావుగా జరిగేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీఆర్ఓ తిప్పేనాయక్, కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు ఎస్ మల్లి బాబు, ఎన్. శ్రీధర్, జిల్లా రిజిస్టర్ కె. ప్రసాద్ రావు, కాకినాడ రూరల్, తొండంగి, యు.కొత్తపల్లి మండలాల తహశీల్దార్లు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# హెల్మెట్ ధరించండి ప్రాణాలను కాపాడుకోండి

## కొయ్యలగూడెంలో హెల్మెట్లపై అవగాహన కార్యక్రమం

## జరిమానాలు విధించకుండా వాహనదారులకు అవగాహన కల్పించిన పోలీసులు

## హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఎస్ఐ చంద్రశేఖర్



**కొయ్యలగూడెం (వజ్రభారతి) ఏలూరు జిల్లా ఇంచార్జ్ మార్చి 05 :** ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి సురక్షితంగా ఇంటికి చేరుకోవాలని కొయ్యలగూడెం ఎస్ఐ చంద్రశేఖర్ సూచించారు. ఏలూరు జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాలు మేరకు, పోలవరం డీఎస్పీ ఎం. వెంకటేశ్వరరావు మార్గదర్శకత్వంలో గురువారం కొయ్యలగూడెం ప్రాంతంలో ప్రత్యేక హెల్మెట్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.పోలవరం సర్కిల్ ఇన్స్పెక్టర్ బాల సురేష్ బాబు ఆధ్వర్యంలో ఎస్ఐ చంద్రశేఖర్ పోలీస్ సిబ్బందితో కలిసి రహదారులపై తనిఖీలు నిర్వహించి ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న పలువురు వాహనదారులను ఆపి వారికి అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ముఖ్యంగా జరిమానాలు విధించకుండా బాధ్యతాయుత చర్యగా హెల్మెట్ ధరించని వాహనదారులకు హెల్మెట్లు కొనుగోలు చేయించి అవగాహన కల్పించారు. పోలీసులు తీసుకున్న ఈ వినూత్న చర్యకు వాహనదారులు అభినందనలు తెలిపారు.రోడ్డు ప్రమాదాలు ఎప్పుడు, ఎలా జరుగుతాయో ఎవరూ ముందుగా ఊహించలేరని, ప్రమాద సమయంలో ప్రాణాలను కాపాడే ప్రధాన రక్షణ కవచం హెల్మెట్ మాత్రమేనని ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. హెల్మెట్ భారం కాదు, అది ప్రాణాలను కాపాడే భద్రతా కవచమని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో సంభవించే మరణాల్లో ఎక్కువ శాతం తలకు గాయాల వల్లే జరుగుతాయని, హెల్మెట్ ధరించడం ద్వారా మెదడు గాయాల ప్రమాదం 70 నుంచి 80 శాతం వరకు తగ్గుతుందని వివరించారు. హెల్మెట్ గ్లాస్ గాలి, ధూళి, పురుగులు, ఇసుక రేణువుల నుంచి కళ్లను రక్షిస్తుందని, ఎండ, వర్షం, చలి వంటి వాతావరణ ప్రభావాల నుంచి కూడా తలను కాపాడుతుందని చెప్పారు.ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా జరిమానాలు తప్పించుకోవడంతో పాటు బాధ్యతాయుత పౌరుడిగా నిలవవచ్చని సూచించారు. హెల్మెట్ కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా ఐఎస్ఐ మార్క్ ఉన్నదో లేదో పరిశీలించాలని అన్నారు.పోలీసుల నుంచి తప్పించుకోవడానికి కాదు, ప్రాణాలను కాపాడుకోవడానికే హెల్మెట్ ధరించాలని సూచించారు. ఇంట్లో ఎదురుచూస్తున్న కుటుంబ సభ్యులను గుర్తు చేసుకుని ప్రతి వాహనదారుడు భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. తలరాతను మార్చలేము కానీ తలకు హెల్మెట్ పెట్టి ప్రమాదాలను తప్పించుకోవచ్చని పేర్కొన్నారు. స్టైల్ కోసం హెల్మెట్ వదలకుండా, బైక్ వేగం కంటే ప్రాణం ముఖ్యమని గుర్తుంచుకోవాలని ఎస్ఐ చంద్రశేఖర్ సూచించారు.

# కార్యకర్తలకు గుర్తింపు, భీమా రక్షణ కల్పిస్తున్న ఏకైక పార్టీ జనసేన -- ఎంపీ ఉదయ్





**కాకినాడ,వజ్రభారతి,ప్రతినిధి,స్టేట్ బ్యూరో,మార్చి,5:-** కాకినాడలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగేళ్ల ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ పార్టీ సంస్థాగత బలోపేతానికి సభ్యత్వ నమోదు కార్యక్రమం అత్యంత కీలకమని పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలకు గుర్తింపు, గౌరవం మాత్రమే కాకుండా భీమా రక్షణ వంటి భద్రతా వ్యవస్థను కూడా కల్పిస్తున్న ఏకైక రాజకీయ శక్తి జనసేన పార్టీ అని ఆయన స్పష్టం చేశారు.ఈ సమావేశంలో జగ్గంపేట నియోజకవర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలు మరియు 'సాధక్'లతో సభ్యత్వ నమోదు కార్యక్రమం పురోగతిపై సమీక్ష నిర్వహించారు. పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సమస్యలపై పార్టీ పోరాటాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని ఎంపీ సూచించారు. గ్రామ స్థాయి నుంచి బూత్ స్థాయి వరకు పార్టీ నిర్మాణాన్ని మరింత బలోపేతం చేసి, ప్రజలతో సన్నిహితంగా పని చేయాలని ఆయన సాధక్‌లకు సూచించారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని కేవలం ఒక కార్యక్రమంగా కాకుండా ప్రజా ఉద్యమంలా నిర్వహించాలని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ముఖ్యంగా యువతను పెద్ద ఎత్తున పార్టీలోకి ఆహ్వానిస్తూ, కొత్త తరానికి రాజకీయాల్లో భాగస్వామ్యం కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. పార్టీ ఆశయాలు, విధానాలు ప్రజల్లో విస్తృతంగా చేర్చేందుకు ప్రతి కార్యకర్త బాధ్యతగా పనిచేయాలని ఆయన సూచించారు. అలాగే గ్రామాలు, వార్డులు, బూత్ స్థాయిల్లో పార్టీ కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తే జనసేన పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఎంపీ పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం పార్టీ ఎల్లప్పుడూ ముందుండి పోరాడుతుందని, ప్రజా నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా పనిచేయాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మరియు జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు తుమ్మల రామస్వామి బాబు , జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ తో పాటు పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేసి పార్టీని గ్రామ స్థాయిలో మరింత బలోపేతం చేయాలని సమావేశంలో నాయకులు నిర్ణయించారు.

# అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు సైబర్ నేరాలు, పోక్సో చట్టంపై అవగాహన





**కాకినాడ,వజ్రభారతి,ప్రతినిధి,స్టేట్ బ్యూరో,మార్చి, 5:-** అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీమతి చి. లక్ష్మి ఆదేశాల మేరకు, సీడీపీఓ వై. లక్ష్మి ఆధ్వర్యంలో కాకినాడ రూరల్ మండలం గైగోలుపాడు గ్రామ సచివాలయంలో మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్చి 2వ తేదీ నుంచి మార్చి 20వ తేదీ వరకు మహిళల భద్రత, సైబర్ నేరాలు, పోక్సో చట్టం, మొబైల్ ఫోన్ వినియోగం, బ్యాంకింగ్ లావాదేవీలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీడీపీఓ వై. లక్ష్మి మాట్లాడుతూ మహిళలు తమ పిల్లలను మొబైల్ ఫోన్ దుర్వినియోగం నుండి కాపాడాలని, సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే బ్యాంకింగ్ లావాదేవీలు నిర్వహించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కుటుంబాన్ని సక్రమంగా నడిపించే బాధ్యత ఎక్కువగా మహిళలదేనని ఆమె పేర్కొన్నారు. చిన్న వయసులో ఆడపిల్లలకు వివాహాలు జరిపితే గర్భధారణ కారణంగా శిశు మరణాల శాతం పెరిగే ప్రమాదం ఉందని, అందువల్ల తగిన వయస్సు వచ్చే వరకు వివాహాలు చేయకూడదని ఆమె సూచించారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం సోషల్ వర్కర్ చిన్నబాబు మాట్లాడుతూ బాల్య వివాహ నిరోధక చట్టం 2006 ప్రకారం బాలికలకు 18 సంవత్సరాలు, బాలురకు 21 సంవత్సరాలు వివాహ వయస్సుగా నిర్ణయించబడిందని తెలిపారు. ఆ వయస్సుకు ముందు వివాహం చేస్తే చట్టపరమైన శిక్షలు ఉంటాయని వివరించారు. అలాగే పోక్సో చట్టం ప్రాముఖ్యత, పిల్లల రక్షణ కోసం ప్రభుత్వం అందిస్తున్న సేవల గురించి కూడా అవగాహన కల్పించారు. అంగన్వాడీ సూపర్వైజర్ సూర్యావతి మాట్లాడుతూ తమ సెక్టార్ పరిధిలోని ప్రతి అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు సరైన పౌష్టికాహారం అందించడంతో పాటు ఆటపాటలతో కూడిన ప్రాథమిక విద్యను అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. న్యూట్రిషన్ డాక్టర్ మల్లేశ్వరి మాట్లాడుతూ మహిళలందరూ తగిన పౌష్టికాహారం తీసుకోవాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, పారా లీగల్ వాలంటీర్లు అబ్దుల్, మల్లికార్జున, అంగన్వాడీ టీచర్లు, క్రాఫ్ ఎన్‌జీఓ సిబ్బంది పుష్ప, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు మరియు స్థానిక మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మహిళల్లో చట్టాలపై మరియు భద్రతపై అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని నిర్వాహకులు తెలిపారు.



## అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మిషన్ శక్తి కార్యక్రమాలు -- మహిళల ఆరోగ్యంపై అవగాహన

**కాకినాడ,వజ్రభారతి,ప్రతినిధి, స్టేట్ బ్యూరో,మార్చి, 5:-** అంతర్జాతీయ మహిళా దినోత్సవం--2026 సందర్భంగా నిర్వహిస్తున్న మిషన్ శక్తి 20 రోజుల కార్యక్రమంలో భాగంగా మార్చి 2 నుంచి మార్చి 20 వరకు పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా మార్చి 5న స్థానిక సంజయనగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ)లో మహిళల ఆరోగ్యం, సురక్షిత మాతృత్వంపై ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు.దుమ్ములపేట సెక్టార్ సూపర్వైజర్ దయామణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ నిషేధ చట్టం (పీసీపీఎన్‌డీటీ చట్టం), కిషోర బాలురు--బాలికల ఆరోగ్య సంరక్షణ, సురక్షిత మాతృత్వం మరియు ప్రధాన మంత్రి మాతృ వందన యోజన పథకం గురించి సమగ్ర అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ జి.ఏ. దేవి మాట్లాడుతూ చేతుల పరిశుభ్రత ప్రాముఖ్యత, మూత్ర మార్గ సంక్రమణలు, గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ నిషేధం, గర్భిణీలు తీసుకోవాల్సిన పోషకాహారం, టీనేజ్ గర్భధారణ వల్ల కలిగే ఆరోగ్య సమస్యల గురించి వివరంగా అవగాహన కల్పించారు.హెల్త్ విజిటర్ అరుణ మాట్లాడుతూ టీనేజ్ గర్భధారణ వల్ల తల్లి మరియు శిశువు ఆరోగ్యంపై కలిగే ప్రతికూల ప్రభావాలను వివరించారు. అనంతరం ఏఎన్ఎమ్ సునీత సురక్షిత మాతృత్వం, గర్భిణీ స్త్రీలకు ఇవ్వాల్సిన టీకాల ప్రాధాన్యత గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, గర్భిణీ స్త్రీలు, కిషోరి బాలికల తల్లులు పాల్గొని ఆరోగ్యానికి సంబంధించిన పలు అంశాలపై అవగాహన పొందారు. మహిళల ఆరోగ్య పరిరక్షణ కోసం ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అధికారులు తెలిపారు.

## శ్రీ సత్తెమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరిపైనా ఉండాలి. -ప్రత్తిపాడు వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు



**ప్రత్తిపాడు,వజ్రభారతి,ప్రతినిధి,స్టేట్ బ్యూరో,మార్చి, 5:-** శ్రీ సత్తెమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరిపైనా ఉండాలని ప్రత్తిపాడు నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. గురువారం ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి గ్రామంలో వేంచేసియున్న శ్రీ సత్తెమ్మ తల్లి ఆలయాన్ని ముద్రగడ గిరిబాబు సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్బంగా ముద్రగడ గిరిబాబు మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని,అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఇంటిపైనా ఉండాలని, అందరికీ ఆయురారోగ్యాలు సిద్ధించాలని కోరుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రామిశెట్టి నాని,ఎంపిటిసి సాధానాల అప్పారావు, మాజీ సొసైటీ చైర్మన్ కొప్పన గంగారావు, రామకుర్తి రవిబాబు, సూరారపు ఏసుబాబు,ములికి వీరాస్వామి కొప్పన నాయుడు, కొప్పన రాంబాబు, గోపు వీరభద్రరావు పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## సీతంపేట గ్రామంలో పర్యటించిన ముద్రగడ....

**శంఖవరం వజ్ర భారతి ప్రతినిధి. ముఖే.వీరబాబు మార్చి :- 5 :** సీతంపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణుడు ఆలయ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రత్తిపాడు నియోజకవర్గ ఇంచార్జ్ ముద్రగడ గిరిబాబు ఈ సందర్భంగా ఆయన ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలందరిపై శ్రీకృష్ణుడి ఆశీస్సులు మెండుగా ఉండాలని, అందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శంఖవరం మండల కన్వీనర్ నరాల శ్రీను అడపా సోమేశ్ ఎంపీటీసీలు చల్లా సత్య ప్రసాద్ రాంబాబు జగన్ స్థానిక వైసీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు



# అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించాలి





### ఉత్తమ సేవలందించిన మహిళా ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు

### స్వయం సహాయక సంఘాలకు రుణాల పంపిణీ

### నియోజకవర్గ స్థాయిలో మహిళా దినోత్సవ వేడుకలు

### మహిళా దినోత్సవానికి విస్తృత ఏర్పాట్లు

### అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి

**ఏలూరు (వజ్ర భారతి) మార్చి05:** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు విస్తృతమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం ఏలూరు కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశ మందిరంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీన జరగనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా మరియు నియోజకవర్గ స్థాయిలలో వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారులు తమ నియోజకవర్గాల్లో ఆహ్లాదకర వాతావరణంలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించేలా ఏర్పాట్లను పర్యవేక్షించాలని తెలిపారు.డిఆర్డిఏ, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వివిధ శాఖల సమన్వయంతో కార్యక్రమాల కోసం అవసరమైన ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని ఆదేశించారు. కార్యక్రమ ప్రాంగణంలో వివిధ శాఖల ఆధ్వర్యంలో స్టాల్స్ ఏర్పాటు చేయాలని, మహిళల్లో చైతన్యం కలిగించేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.జిల్లాలో వివిధ రంగాల్లో స్వచ్ఛంద సేవలందిస్తున్న మహిళలు, అలాగే వివిధ శాఖల్లో ఉత్తమ సేవలందిస్తున్న మహిళా ఉద్యోగినులకు ప్రశంసా పత్రాలు అందించి సన్మానించాలని తెలిపారు. మహిళల హక్కులు, భద్రతకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు గురించి అవగాహన కల్పించాలని అన్నారు. మహిళల రక్షణ కోసం రూపొందించిన శక్తి యాప్ వంటి సేవలపై కూడా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించే హెల్త్ చెకప్ శిబిరాలు ఏర్పాటు చేయాలని, ముఖ్యంగా క్యాన్సర్ స్క్రీనింగ్‌కు సంబంధించిన ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు. అలాగే పోషకాహారంపై అవగాహన కల్పించేందుకు న్యూట్రిషన్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయాలని చెప్పారు.మహిళా దినోత్సవ కార్యక్రమాల్లో మహిళలతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు తప్పక హాజరు కావాలని కలెక్టర్ సూచించారు.ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వి. విశ్వేశ్వరరావు, డిఆర్డిఏ పీడీ విజయలక్ష్మి, ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ ఏ. భాను ప్రతాప్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. శోభ, ఐసిడిఎస్ పీడీ పి. శారద, జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఆర్.వి. నాగరాణి, మెప్మా పీడీ రాజాబాబు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ లక్ష్యాలను సాధించాలి

### రుణాల మంజూరుతో పాటు యూనిట్ల స్థాపన జరిగేలా చర్యలు

### బ్యాంకు లింకేజీ రుణాల మంజూరుపై అధికారులతో సమీక్ష

### కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఆదేశాలు



**ఏలూరు (వజ్ర భారతి) మార్చి 05:** జిల్లాలో స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాల లక్ష్యాలను ఈ నెలాఖరులోగా పూర్తిగా సాధించాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. గురువారం ఏలూరు కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశ మందిరంలో స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలు, యూనిట్ల స్థాపన తదితర అంశాలపై డిఆర్డిఏ, డ్వామా, బ్యాంకు అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో స్వయం సహాయక సంఘాలకు రూ. 1398.24 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాల మంజూరు లక్ష్యం ఉండగా, ఇప్పటివరకు రూ. 1242.48 కోట్ల రుణాలు మంజూరు అయ్యాయని తెలిపారు. మిగిలిన రూ. 155.76 కోట్ల రుణాలను ఈ నెలాఖరులోగా మంజూరు చేసేలా బ్యాంకర్లతో సమన్వయం చేసుకోవాలని అధికారులకు సూచించారు.స్వయం సహాయక సంఘాలు తాము కోరే రుణాలకు సంబంధించిన సూక్ష్మ రుణ ప్రణాళికలను (మైక్రో క్రెడిట్ ప్లాన్) బ్యాంకులకు త్వరితగతిన అందించేలా చూడాలని అన్నారు. బ్యాంకర్లు వాటిని పరిశీలించి త్వరగా రుణాలు మంజూరు చేసేలా జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు సమన్వయం చేయాలని ఆదేశించారు.రుణాలు పొందిన సంఘాలు యూనిట్లను త్వరితగతిన ఏర్పాటు చేసేలా వారికి అవసరమైన సూచనలు, సాంకేతిక సహాయ సహకారాలు అందించాలని తెలిపారు. జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపన కోసం దరఖాస్తు చేసిన వాటిని పరిశీలించి వెంటనే రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లకు సూచించారు.ఈ సమావేశంలో డిఆర్డిఏ పీడీ విజయలక్ష్మి, ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ ఏ. భాను ప్రతాప్, మెప్మా పీడీ రాజాబాబు, లీడ్ బ్యాంకు అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.




## కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ జగ్గంపేట సాధక్ లతో విస్తృత స్థాయి సమావేశం

**జగ్గంపేట,వజ్రభారతి,ప్రతినిధి, జగ్గంపేట నియోజకవర్గ ఇంచార్జ్, మార్చి, 05:-** కాకినాడ ఎంపీ ఉదయ శ్రీనివాస్ నివాసంలో జగ్గంపేట నియోజకవర్గం క్రియాశీలక సభ్యత్వాలు చేస్తున్న సాధక్ లతో ముఖ్య సమావేశం నిర్వహించబడింది.ఈ సమావేశం ఎంపీ ఉదయ శ్రీనివాస్ ఆధ్వర్యంలో, జిల్లా అధ్యక్షులు తుమ్మల బాబు అధ్యక్షతన జగ్గంపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జ్ తుమ్మలపల్లి రమేష్ పర్యవేక్షణలో జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్యకర్తల కోసం ఇతర రాజకీయ పార్టీలు చేయని విధంగా పవన్ కళ్యాణ్ క్రియాశీలక సభ్యత్వ కార్యక్రమాన్ని చేపట్టారని తెలిపారు. తన వెంట తిరిగే కార్యకర్త ఏదైనా ప్రమాదంలో మరణిస్తే ఆ కుటుంబానికి ?5 లక్షల ఇన్సూరెన్స్ అందించే కార్యక్రమాన్ని దేశంలో మొట్టమొదటిసారిగా పవన్ కళ్యాణ్ గారు ప్రవేశపెట్టారని తెలిపారు.గత సంవత్సరం కంటే ఈసారి జగ్గంపేట నియోజకవర్గంలో రెట్టింపు సభ్యత్వాలు నమోదు చేయాలని పిలుపునిచ్చారు. దీనికి పూర్తి సహకారం అందిస్తామని నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో జగ్గంపేట నియోజకవర్గానికి చెందిన క్రియాశీలక సాధక్‌లు పాల్గొన్నారు.

## క్యాన్సర్ పై అవగాహన పెంచాలి

### సత్యసాయి పాలియేటివ్ కేర్ క్యాన్సర్ సెంటర్‌ను సందర్శించిన జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

పుట్టపర్తి,వజ్ర భారతి (సత్యసాయి జిల్లా ప్రతినిధి)మార్చి 05:-పుట్టపర్తి లోని స్థానిక శ్రీ సత్యసాయి పాలియేటివ్ కేర్,క్యాన్సర్ సెంటర్‌ను జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించి,రోగులకు అందుతున్న వైద్య సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు.క్యాన్సర్ చివరి దశలో ఉన్న రోగులకు,దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఈ కేంద్రం అందిస్తున్న ఉచిత సేవలు అభినందనీయమని కలెక్టర్ కొనియాడారు.జిల్లాలో క్యాన్సర్ పట్ల అవగాహన పెంచాలని, ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇలాంటి సేవా సంస్థలకు ప్రభుత్వం తరపున అవసరమైన సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. ఆసుపత్రిలోని మెడికల్ ఎక్విప్‌మెంట్,పాలియేటివ్ కేర్ విభాగాల పనితీరును ఆయన ప్రత్యక్షంగా చూసి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి నిర్వాహకులు,వైద్యులు,సిబ్బంది ఇతర రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.





## జగ్గంపేటలో లక్ష్మీదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన జ్యోతుల లక్ష్మీదేవి

**జగ్గంపేట,వజ్రభారతి,ప్రతినిధి, జగ్గంపేట నియోజకవర్గ ఇంచార్జ్, మార్చి, 05:-** జగ్గంపేటలోని విష్ణాలయం ప్రాంగణంలో ఉన్న లక్ష్మీదేవి అమ్మవారి ఆలయంలో జన్మదినోత్సవ పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ నెల 3న అమ్మవారి జన్మదినోత్సవం సందర్భంగా సూర్యగ్రహణం కారణంగా ఆలయాన్ని మూసివేయడంతో గురువారం ప్రత్యేకంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కుంకుమ పూజలు చేశారు.ఈ కార్యక్రమానికి కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షుడు, జగ్గంపేట నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల నవీన్ సతీమణి జ్యోతుల లక్ష్మీదేవి హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ ప్రాంత ప్రజలు సిరిసంపదలతో, పాడిపంటలతో సుఖసంతోషాలతో జీవించాలని అమ్మవారి ఆశీస్సులు కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో కొత్త మాదిరి ఆండాళ్, డాక్టర్ ప్రసాద్ సతీమణి మాధవి, కొత్త లక్ష్మీసాయి తదితరులు పాల్గొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

## పరిశుభ్రమైన వాతావరణంలో ఆరోగ్యాంగా ఉండాలి

**కలెక్టరేట్‌లో డైనింగ్ హాల్ ను ప్రారంభించిన -జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్‌లి**



పుట్టపర్తి,వజ్ర భారతి (సత్యసాయి జిల్లా ప్రతినిధి)మార్చి 05:-శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టరేట్లో నూతనంగా ఏర్పాటు చేసిన డైనింగ్ హాల్‌ను,జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ గురువారం ప్రారంభించారు.వేదమంత్రాల ఉచ్చారణ,ప్రత్యేక పూజా కార్యక్రమాలతో శాస్త్రోక్తంగా ఈ డైనింగ్ హాల్‌ను ప్రారంభించారు. కలెక్టరేట్‌లో పనిచేసే సిబ్బంది మండలాల నుండి వివిధ పనుల నిమిత్తం వచ్చే సిబ్బంది సౌకర్యార్థం దీనిని ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ తెలిపారు.సిబ్బంది అందరూ ఈ భోజన శాలను సద్వినియోగం చేసుకోవాలని,పరిశుభ్రమైన వాతావరణంలో ఆరోగ్యకరంగా ఉండాలని కలెక్టర్ ఆకాంక్షించారు. డైనింగ్ హాల్‌ను యెర్పాటు చేసినందుకు కలెక్టరేట్ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.జిల్లా కలెక్టర్ కి ధన్యవాదాలు తెలియజేసారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి (డిఆర్ఓ )విజయసారధి , జిల్లా పౌరసరఫరాల అధికారి వంశీకృష్ణ,స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ర్యనారాయణ రెడ్డి,ఎస్డబ్ల్యూఎస్ అధికారి సుధాకర్,అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సక్సేనా,రి సర్వే ఎడీ విజయ శాంతి,తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## సుప్రీంకోర్టు న్యాయమూర్తిని మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

హిందూపురం,వజ్ర భారతి మార్చి 05:-పట్టణంలోని స్థానిక ఆర్ అండ్ బి (ఆర్‌డబి ) అతిథి గృహంలో, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.వి. విశ్వనాథన్ ని,శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా న్యాయమూర్తికి కలెక్టర్ పుష్పగుచ్ఛం అందజేసి ఘనస్వాగతం పలికారు.సత్య సాయి జిల్లాలోని పలు అభివృద్ధి పనులు పరిపాలనాంశాల గురించి వారు చర్చించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం





**సహనానికి ప్రతిరూపం మహిళ.**

**చైతన్యంతోనే బాల్యవివాహాలను నివారించాలి.**

అమడగూరు,వజ్ర భారతి మార్చి 05:-సహనానికి ప్రతిరూపం మహిళ అని,మహిళా దినోత్సవ స్ఫూర్తిని ఒక్కరోజుకే పరిమితం చేయకుండా ప్రతిరోజూ ఆచరించాలని, ఐసిడిఎస్ సూపర్వైజర్ గంగాదేవి పేర్కొన్నారు.మండల కేంద్రంలోని అంగన్వాడి సెక్టర్--2 కేంద్రంలో గురువారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో,అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా బాల్ వివాహ ముక్త్ భారత్ -100 రోజుల కార్యక్రమం గురించి మహిళలకు గ్రామస్థులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ గంగాదేవి మాట్లాడుతూ,బాల్యవివాహాలు బాలికల విద్య,ఆరోగ్యం భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతాయని వివరించారు. బాలికలు చిన్న వయసులోనే వివాహం చేసుకుంటే వారి చదువు ఆగిపోవడం,ఆరోగ్య సమస్యలు రావడం,జీవితంలో అభివృద్ధి అవకాశాలు తగ్గిపోవడం వంటి అనేక అనర్థాలు కలుగుతాయని తెలిపారు.అందువల్ల బాల్యవివాహాలను నివారించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.అలాగే గ్రామాన్ని బాల్యవివాహ రహిత స్వేచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దేందుకు, గ్రామస్థులతో ప్రతిజ్ఞ చేయించారు. గ్రామంలో ఎక్కడైనా బాల్యవివాహం జరగబోతున్నట్లు తెలిసిన వెంటనే అధికారులకు తెలియజేయాలని కోరారు. బాల్యవివాహ నిరోధక చట్టం ప్రకారం బాలికలకు 18 సంవత్సరాలు,బాలురకు 21 సంవత్సరాలు పూర్తికాకముందు వివాహం జరపడం నేరమని వివరించారు.ఈ సందర్భంగా పోక్సో యాక్ట్ -2012 గురించి కూడా అవగాహన కల్పించారు. చిన్నారులపై లైంగిక వేధింపులు మరియు దుర్వినియోగాన్ని అరికట్టేందుకు ఈ చట్టం అమలులో ఉందని తెలిపారు.పిల్లలపై ఎలాంటి అన్యాయం జరిగినా వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.అదేవిధంగా లింగ నిర్ధారణ నిషేధం,బాలికల విద్య ప్రాముఖ్యత మహిళల సాధికారత గురించి కూడా వివరించారు.ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ గంగాదేవి,జిల్లా బాలల పరిరక్షణ సమితి కే మేఘనా బాయి ,అంగన్వాడిలు రమాదేవి, సరస్వతి,అరుణ, సునీత,రామకృష్ణమ్మ,జమృత్ ప్యారి,తదితరులు పాల్గొన్నారు.

## విజయవాడ దుర్గమ్మ సన్నిధిలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి,మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి

**ఆంధ్రప్రదేశ్ ప్రజలు సుభిక్షంగా ఉండాలని.... ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరోగ్యంగా ఉండి ప్రజలకు సేవాలాందించని కోరుకున్న ఎమ్మెల్యే సింధూర,మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి**



పుట్టపర్తి,వజ్ర భారతి (సత్యసాయి జిల్లా ప్రతినిధి)మార్చి 05:-రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని చంద్రబాబు నాయుడు మరో 20 ఏళ్లు ముఖ్యమంత్రిగా ప్రజలకు సుపరిపాలన అందించాలని కోరుకున్నట్లు,పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తెలిపారు. విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో గురువారం పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి తోపాటు,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ,నియోజవర్గ కూటమి పార్టీల ప్రజా ప్రతినిధులు,నాయకులతో కలసి దుర్గమ్మను దర్శించుకున్నారు.ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించి వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం మరో 20 ఏళ్లు ప్రజలకు సుపరిపాలన అందించాలని, దుర్గమ్మను కోరుకున్నట్లు తెలిపారు.దేశంలోనే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో కొనసాగుతున్న కూటమి ప్రభుత్వం లో సంక్షేమం,అభివృద్ధినీ రాష్ట్రానికి రెండు కళ్లులా అమలు చేస్తున్నారని కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు అంతా మంచి జరగాలని ఆశిస్తున్నట్లు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి లు విజయవాడ కనకదుర్గమ్మను కోరుకున్నట్టు తెలిపారు.



## మహిళా సాధికారికతకు వాకథాన్ ర్యాలీ




**రాజమహేంద్రవరం, వజ్రభారతి,మార్చి 5:(ఎండి నజీర్ అహ్మద్):** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జరుగుతున్న మహిళా సాధికారికత వారోత్సవాలలో భాగంగా రాజమహేంద్రవరం లో మహిళా పోలీసులు, సిబ్బంది, విద్యార్థినులతో కలిసి అవగాహన వాకథాన్ ర్యాలీ నిర్వహించారు. పుష్కర్ ఘాట్ నుంచి ప్రారంభమైన ర్యాలీ త్రీ టౌన్ పోలీస్ స్టేషన్, గోకవరం బస్టాండ్ మీదుగా దేవి చౌక్ వరకు సాగింది. ఈ సందర్భంగా మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ సుభద్రమ్మ మాట్లాడుతూ మహిళలు కష్టపడి చదివి ఆర్థిక స్వావలంబన సాధిస్తే సమాజంలో గౌరవం పెరుగుతుందని తెలిపారు. మహిళల భద్రత కోసం ఏర్పాటు చేసిన "శక్తి" యాప్ ప్రతి మహిళ వినియోగించుకోవాలని సూచించారు. ర్యాలీలో మహిళా పోలీసులు, సిబ్బంది, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సింగారమ్మ అమ్మవారిని దర్శించుకున్న జ్యోతుల లక్ష్మీదేవి, అనీష్ నెహ్రూ

**జగ్గంపేట,వజ్రభారతి,ప్రతినిధి, జగ్గంపేట నియోజకవర్గ ఇంచార్జ్, మార్చి, 05:-** జగ్గంపేట మండలం మల్లిశాల గ్రామ శివారులోని సింగారమ్మ చింతలో వెలసిన సింగారమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. జాతర మూడో రోజు కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షుడు జ్యోతుల నవీన్ సతీమణి జ్యోతుల లక్ష్మీదేవి, కుమారుడు అనీష్ నెహ్రూ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు వారిని ఘనంగా సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు.మల్లిశాల గ్రామ ప్రజల ఆరాధ్య దేవతగా పేరుగాంచిన సింగారమ్మ అమ్మవారి జాతర ప్రతి సంవత్సరం మార్చి నెలలో వారం రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. వేలాదిమంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విద్యుత్ దీపాలతో ఆలయాన్ని అలంకరించడంతో పాటు భక్తుల కోసం ప్రత్యేక క్యూ లైన్లు, వినోద కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.మార్చి 3 నుంచి 7 వరకు జాతర వైభవంగా కొనసాగనుంది. కమిటీ అధ్యక్షులుగా పైడిపాల సూరిబాబు, ముంద్రు ఎర్రబాబు, పాలికిరెడ్డి సత్యనారాయణ, నక్కరాజు వీరబాబు, కుప్పల నాగు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జాతరను విజయవంతం చేస్తున్నారు.





## గంటలోపే వృద్ధుడి రూ.50 వేల నగదు రికవరీ
## పోలీసుల సమయస్ఫూర్తికి ప్రశంసలు

**ఏలూరు (వజ్ర భారతి) మార్చి 05:** బస్సు ఎక్కే క్రమంలో రద్దీలో పోగొట్టుకున్న రూ.50,000 నగదును పోలీసులు కేవలం గంట వ్యవధిలోనే గుర్తించి బాధితుడికి అందజేసి తమ సమయస్ఫూర్తి, వృత్తి నైపుణ్యాన్ని చాటుకున్నారు.

దెందులూరు మండలం కొవ్వలి గ్రామానికి చెందిన నందిగం శ్రీకృష్ణ సౌందర్య భగవాన్ తన భార్యతో కలిసి గురువారం ఉదయం సత్తుపల్లి వెళ్లేందుకు ఏలూరు బస్టాండ్‌కు వచ్చారు. బస్సు ఎక్కుతున్న సమయంలో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండటంతో ఆయన జేబులో ఉన్న రూ.50,000 నగదు అజాగ్రత్తగా కింద పడిపోయింది. కొద్దిసేపటి తర్వాత నగదు కనిపించకపోవడంతో ఆయన తీవ్ర ఆందోళనకు గురై వెంటనే స్థానిక పోలీసులను ఆశ్రయించారు.బాధితుడి ఫిర్యాదు అందుకున్న వెంటనే ఏలూరు టూ టౌన్ సీఐ అశోక్ కుమార్, ఎస్ఐ మధు వెంకట రాజా తమ సిబ్బందితో కలిసి రంగంలోకి దిగారు. బస్టాండ్ పరిసరాల్లోని సీసీటీవీ ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలించి, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నగదు ఎక్కడ పడింది, ఎవరు తీసుకున్నారనే అంశాలను వేగంగా గుర్తించారు.పోలీసుల చురుకైన చర్యల ఫలితంగా నగదు పోయిన గంటలోపే దానిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం స్టేషన్‌కు బాధితుడిని పిలిపించి అందరి సమక్షంలో నగదును భద్రంగా అప్పగించారు.ఈ సందర్భంగా సీఐ అశోక్ కుమార్ మాట్లాడుతూ, ప్రజల భద్రతతో పాటు వారి ఆస్తులను కాపాడటం మా ప్రథమ కర్తవ్యం. బాధితుడు వెంటనే ఫిర్యాదు చేయడం వల్ల మేము త్వరగా స్పందించగలిగాం అని తెలిపారు.తమ కష్టార్జితం తిరిగి దక్కడంతో భగవాన్ దంపతులు ఆనందం వ్యక్తం చేస్తూ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

## రౌతులపూడి మండలం లో ముద్రగడ సుడిగాలి పర్యటన...






**రౌతులపూడి వజ్రభారతి ప్రతినిధి. ముఖే. వీరబాబు మార్చి :- 5** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం లో వైసిపి ఇంచార్జ్ ముద్రగడ గిరిబాబు రౌతులపూడి మండలం లో పలు గ్రామం లో శుభ కార్యక్రమంలో పర్యటించిన గిరిబాబు, పల్లపు చామవురం గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్త దగ్గుబిల్లి సత్యనారాయణ కుమార్తె వివాహ వేడుకకు హాజరై మరియు లచ్చిరెడ్డిపాలెంలో గింజాల లావరాజు కుమారుడు పుట్టినరోజు వేడుకకు మరియురాజవరం గ్రామంలో దోమాడ రాము కుమారుడు వివాహ వేడుకకు ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ శ్రీ ముద్రగడ గిరిబాబు హాజరై వరుడు దుర్గాప్రసాద్ ను ఆశీర్వదించి దీవించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అంగులూరి లక్ష్మీ శివకుమారి వాసిరెడ్డి జమిల్ దివనం దడాల సతీష్ వైసీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు వైసీపీ శ్రేణులు పాల్గొన్నారు

## వివాహా మహోత్సవ కార్యక్రమంలో నూతన దంపతులను ఆశీర్వదించిన.... జాలేనరసింహారెడ్డి

**నల్గొండ జిల్లా వజ్ర భారతి న్యూస్ మార్చ్ 05 జిల్లా స్టాప్ రిపోర్టర్:** నల్గొండ జిల్లా చందంపేట మండలంలోని పెద్దమూల గ్రామానికీ చెందిన చంద్రకళ సత్తయ్య యాదవ్ ల కుమారుడు (రాజు యాదవ్, వనజ)ల వివాహా మహోత్సవ కార్యక్రమంలో ప్రముఖ రాజకీయ నాయకులు జాలే నరసింహారెడ్డి పీసీసీ సభ్యులు పీఏసీఎస్ చైర్మన్ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలపడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఇప్ప తిరుపతి రెడ్డి,బందెల తిరుపతయ్య, శ్రీను,తదితరులు పాల్గొన్నారు.



# బూత్ స్థాయి నుంచి పార్టీ బలోపేతమే లక్ష్యం

### సభ్యత్వ నమోదును విస్తృతం చేయాలి: ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్






**కాకినాడ,వజ్రభారతి,ప్రతినిధి,స్టేట్ బ్యూరో,మార్చి, 5:-** కాకినాడ: రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీని గ్రామస్థాయి నుంచి బూత్ స్థాయి వరకు మరింత బలోపేతం చేయడానికి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెల్లా ఉదయ్ శ్రీనివాస్ అన్నారు. పార్టీని పటిష్టమైన ప్రజా శక్తిగా తీర్చిదిద్దడంలో సభ్యత్వ నమోదే ప్రధాన ఆయుధమని ఆయన పేర్కొన్నారు. ప్రతి కార్యకర్త దీనిని బాధ్యతగా తీసుకుని గ్రామాలు, వార్డులు, బూత్ స్థాయిలో ప్రజలను పార్టీకి చేరువ చేసి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.కాకినాడలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ప్రత్తిపాడు మరియు తుని నియోజకవర్గాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, 'సాధక్'లతో సభ్యత్వ నమోదు కార్యక్రమ పురోగతిపై ఆయన చర్చించారు. గ్రామ స్థాయి నుంచి బూత్ స్థాయి వరకు పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేయడానికి సభ్యత్వ నమోదు కీలకమని, ప్రతి నాయకుడు, కార్యకర్త చురుకుగా పాల్గొని పార్టీకి మరింత బలం చేకూర్చాలని సూచించారు.సభ్యత్వ నమోదులో 'సాధక్'లు క్రియాశీలకంగా వ్యవహరించి మెరుగైన ఫలితాలు సాధిస్తే భవిష్యత్‌లో పార్టీ నిర్మాణంలో కీలక స్థానాలను పొందే అవకాశం కలుగుతుందని ఆయన తెలిపారు. జిల్లాలోనే అత్యధిక సభ్యత్వాల నమోదుతో కొత్త రికార్డు సృష్టించేందుకు అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజల్లో పార్టీ సిద్ధాంతాలు, కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేస్తూ ముఖ్యంగా యువతను పెద్ద సంఖ్యలో పార్టీలోకి ఆకర్షించాల్సిన అవసరం ఉందన్నారు.అలాగే గ్రామాల వారీగా, బూత్‌ల వారీగా సభ్యత్వ నమోదు లక్ష్యాలను నిర్ణయించి, వాటిని సాధించేందుకు ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. పార్టీ కార్యకర్తలు ప్రజలతో నిరంతరం మమేకమై వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారం కోసం కృషి చేస్తే పార్టీపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరుగుతుందని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో విజయాన్ని సాధించాలంటే ఇప్పటి నుంచే క్రమబద్ధమైన సంస్థాగత బలం అవసరమని ఆయన పేర్కొన్నారు.ఈ సమావేశంలో డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి , సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ బోడపాటి శివదుత్త , ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త మెడిశెట్టి సూర్యకిరణ్ , బార్లపూడి క్రాంతి, తుని నియోజకవర్గ నాయకులు నల్లమల వాసు , చోడిశెట్టి గణేష్ మరియు పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఢిల్లీలో వేం నరేందర్ రెడ్డి ని కలిసిన అనిల్ కుమార్ యాదవ్





**శేరిలింగంపల్లి వజ్ర భారతి న్యూస్ మార్చ్ 5 రిపోర్టర్ (అరుణ్ రాజ్) :** తెలంగాణ రాష్ట్ర నుంచి ఖాళీ అయిన రెండు రాజ్యసభ స్థానాలకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల జాబితాను ప్రకటించింది పార్టీ అధిష్టానం. ముందుగా ఒక స్థానానికి అభిషేక్ మను సింఘ్వీ పేరును ప్రకటించగా రెండోవ స్థానానికి తీవ్ర పోటీ నెలకొంది. అయితే కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సలహాదారుడు చిరకాల మిత్రుడు వేం నరేందర్ రెడ్డి పేరును ఖరారు చేయడంతో ఉత్కంఠ తెరపడింది. చేవెళ్ల, మహబూబ్ నగర్ పార్లమెంట్ నియోజకవర్గల ఇంచార్జ్ గా శాసనసభ ఎన్నికలలో వేం నరేందర్ రెడ్డి పాత్ర కీలకంగా మారింది. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి బలమైన నేతగా,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నమ్మిన ఆత్మబంధువు గా కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తూ అధికారం దిశగా పార్టీ శ్రేణులను ముందుకు తీసుకెళ్లడంలో రేవంత్ రెడ్డి మార్క్ రాజకీయం కనిపించింది. అనేక రాజకీయ పరిణామాలతో కాంగ్రెస్ పార్టీ వేం నరేందర్ రెడ్డి అభ్యర్థిత్వాన్ని రేవంత్ రెడ్డి ప్రతిపాదించి నిలబెట్టడంలో కీలక పాత్ర పోషించారు. ఈ సందర్భంగా వేం నరేందర్ రెడ్డి ని శేరిలింగంపల్లి నియోజకవర్గం సీనియర్ కాంగ్రెస్ నాయకులు అనిల్ కుమార్ యాదవ్ ప్రత్యేకంగా వేం నరేందర్ రెడ్డి నివాసంలో కలిసి హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. అనిల్ కుమార్ యాదవ్ మీడియాతో మాట్లాడుతూ రానున్న రోజుల్లో అటు కేంద్రంలో ఇటు రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు వేగంగా మారిపోతాయని అన్నారు. భారతదేశ రాజ్య పాలన బాధ్యతలు కాంగ్రెస్ పార్టీకి అప్పగించడానికి ప్రజలు సమయం కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. అగ్రరాజ్య అమెరికా అధ్యక్షుడికి నరేంద్ర సరెండర్ అయ్యాడని అది దేశ సమగ్రతకు విఘాతం అని అన్నారు. తెలంగాణ గడ్డ నుంచి ఢిల్లీ పార్లమెంట్ లోకి వేం నరేందర్ రెడ్డి ప్రాతినిధ్యం వహించడంతో దేశంలో "ఆర్ ఏ ఆర్ ఈ" మార్క్ రాజకీయానికి తొలి అడుగు పడింది అని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం లో ముఖ్యమంత్రి గా రేవంత్ రెడ్డి మరో సారి అధికారంలోకి వస్తారని, దేశ రాజకీయాల్లో రాహుల్ గాంధీ ప్రధాని పీఠాన్ని అధిష్టిస్తారని తన ప్రగాఢ విశ్వాసం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు కాంప్రమైజ్డ్ పీఎం ని దేశం చూసింది ఇకపై పోరాడే సత్తా ఉన్న వీరుడిని దేశం ప్రధానిగా చూడబోతుందని జోస్యం చెప్పారు.

## 8నుంచి విమెన్ హాకీ కప్ టోర్నమెంట్

### అన్ని ఏర్పాట్లు చేసినట్లు మంత్రి వెల్లడి

హైదరాబాద్:ఈ నెల 8 నుండి గచ్చిబౌలి హాకీ స్టేడియం లో నిర్వహిస్తున్న ఉమెన్ వరల్డ్ హాకీ కప్ -2026 క్వాలిఫైయింగ్ టోర్నమెంట్ కు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని రాష్ట క్రీడా, యువజన సర్వీసులు, పశు సంవర్ధక, మత్స్య శాఖా మంత్రివర్యులు వాకిటి శ్రీహరి వెల్లడించారు. రాష్ట్ర క్రీడా సాధికార సంస్థ చైర్మన్ కె శివ సేనా రెడ్డి, సోని బాల మాయాదేవి, ఇతర క్రీడాధికారులు పాల్గొన్నారు. గ్లోబల్ సిటీగా గుర్తింపు పొందుతున్న హైదరాబాద్ మరో ప్రతిష్టాత్మక అంతర్జాతీయ క్రీడా ఈవెంట్‌కు ఆతిథ్యం ఇవ్వబోతోంది. హాకి లో దేశానికి ప్రపంచస్థాయి గుర్తింపు తెచ్చిన ధ్యాన్ చంద్ స్ఫూర్తితో తెలంగాణ ప్రభుత్వ క్రీడా శాఖ ఆధ్వర్యంలో ఫెడరేషన్ ఇంటర్నేషనల్ హాకీ వరల్డ్ క్వాల్గి÷ వుమెన్ హాకీ టోర్నమెంట్ 2026 నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసాము.మార్చి 8 నుంచి 14 వరకు జరిగే ఈ పోటీలు గచ్చిబౌలిలోని గచ్చిబౌలి హాకీ స్టేడియంలో జరుగనున్నాయి. ఈ టోర్నమెంట్‌లో భారత్‌తో పాటు ఆస్ట్రియా, ఇంగ్లాండ్, ఇటలీ, కొరియా, స్కాట్లాండ్, ఉరుగ్వే,వేల్స్ జట్లు పాల్గొంటున్నాయి. ఈ జట్లు ఇప్పటికే హైదరాబాద్ చేరుకుని, గచ్చిబౌలి లో అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేసిన ఆస్ట్రో టర్ఫ్ మైదానంలో ప్రాక్టీస్ చేస్తున్నాయి. మహిళల వరల్డ్ కప్ హాకీ క్వాల్గి÷యైర్స్ 2026 కి ఈ పోటీలు కీలకంగామారనున్నాయి. టోర్నమెంట్‌ను లోటుపాట్లు లేకుండా నిర్వహించేందుకు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ అన్ని సదుపాయాలను సమకూర్చింది. క్రీడాకారుడు అయిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో గచ్చిబౌలి నందు అంతర్జాతీయ ప్రమాణాలతో ఆస్ట్రోట్రర్ఫ్ మైదానం, హై సెక్యూరిటీ, ఆధునిక సదుపాయాలు, క్రీడాకారులకు అత్యుత్తమ వసతి ఏర్పాట్లు చేయబడ్డాయి.ఇప్పటికే ఈ టోర్నమెంట్లో పాల్గొనబోతున్న అన్ని జట్లు హైదరాబాద్‌కు చేరుకున్నాయి. తెలంగాణ ప్రభుత్వ క్రీడా శాఖ ఘనంగా స్వాగత సత్కారాలు చేసింది.



## ఇస్తారు విందులో పాల్గొన్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**రామచంద్రాపురం వజ్రభారతి న్యూస్ మార్చ్05 తెలంగాణ రాష్ట్ర బ్యూరో (డా.ఏర్పుల శ్రీనివాస్):** రంజాన్ పవిత్ర మాసంలో నిర్వహించే ఇఫ్తార్ విందులు హిందూ ముస్లింల ఐక్యతకు ప్రతీకలని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. భారతి నగర్ డివిజన్ పరిధిలోని ఓల్డ్ ఎంఐజి ఫేజ్ 1 లో గల మసీదే మహమ్మదీయా లో ఏర్పాటు చేసిన ఇస్తారు విందుకు పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పటాన్చెరు పట్టణంలో ఈ నెల 13 న నియోజకవర్గస్థాయి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ముస్లిం సోదరులందరూ భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మసీదు అధ్యక్షులు అబ్దుల్ హమీద్, ఎండి మెహబూబ్, మొయిన్, పరమేష్ యాదవ్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే చోరువతో నాలుగో వార్డులో విద్యుత్ సమస్య పరిష్కారం

### జిన్నారం మున్సిపల్ అభివృద్ధికి కృషి చేస్తా

జిన్నారం మున్సిపల్ వజ్ర భారతి న్యూస్ మార్చ్ 05 స్టేట్ బ్యూరో(డా.ఏర్పుల శ్రీనివాస్): సంగారెడ్డి జిల్లా జిన్నారం మున్సిపల్ నాలుగోవ వార్డులో నెలకొన్న విద్యుత్ సమస్యను పరిష్కారానికి నాలుగో వార్డ్ మున్సిపల్ కౌన్సిలర్ బురెడ్డి గారి స్వప్న రాజేందర్రెడ్డి విన్నపం మేరకు, వెంటనే పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ప్రత్యేకంగా స్పందించి విద్యుత్ సమస్య పరిష్కరించడం జరిగింది, అని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డికి జిన్నారం నాలుగో వార్డ్ మున్సిపల్ కౌన్సిలర్ స్వప్న రాజేందర్ రెడ్డి కృతజ్ఞతలు తెలియజేస్తూ నాలుగో వార్డులో నెలకొన్న పలు సమస్యల పరిష్కారానికి చర్యలు స్వప్నరాజేందర్ రెడ్డి. సమస్యను వెంటనే ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లగా ఎమ్మెల్యే నూతన విద్యుత్ ట్రాన్స్ ఫర్, కేబుల్, ట్రాన్స్ఫారానికి స్థలాన్ని కేటాయించి, 5సంవత్సరాలుగా నాలుగవ వార్డులో వున్న ఓవర్ లోడ్ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్థానిక మున్సిపల్ చైర్మన్ నాకీర్తి జనార్ధన్, వైస్ చైర్మన్ వంగేటి ప్రతాపరెడ్డి, మున్సిపల్ కమిషనర్ తిరుపతి, విద్యుత్తు అధికారి గుమ్మడిదల్ జిన్నారం వారికి తక్షణమే సమస్య పరిష్కారానికి అధికారికంగా మౌఖిక ఆదేశాలు ఇవ్వడం జరిగింది, నాలుగో వార్డులో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక చొరవ తీసుకొని ఎమ్మెల్యే గారి చేత పరిష్కరించినందుకు జిన్నారం మున్సిపల్ నాలుగో వార్డ్ కౌన్సిలర్ బురెడ్డిగారి స్వప్న రాజేందర్ రెడ్డిని ప్రజలు అభినందించడం జరిగిందిని.కార్యక్రమంలో వందేటి రాజిరెడ్డి, గాండ్ల శ్రీనివాస్,వెంకట్ రెడ్డి, బాలుచారి,విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి ని కలిసిన బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు శ్రీనివాస్ గౌడ్



**శేరిలింగంపల్లి వజ్ర భారతి న్యూస్ మర్చి05 రిపోర్టర్ (అరుణ్ రాజ్):** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో ఇంచార్జ్ బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి ని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసిన బిఆర్ఎస్ పార్టీ మాదాపూర్ డివిజన్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ ఈ సందర్భంగా డివిజన్లోని పార్టీ బలోపేతం, పలు అభివృద్ధి కార్యక్రమాలపై వారితో చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు,బిక్షపతి ముదిరాజ్ ,రాహుల్ , నీలేష్, అఖిల్,శ్రీకాంత్,బంటీ, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## జిల్లా నూతన న్యాయస్థాన భవనానికి శంకుస్థాపన

### శంకుస్థాపనకు రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ రాక

### నూతన న్యాయస్థాన భవన శంకుస్థాపనకు ఏర్పాట్లు పూర్తి

### జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.నీరజ




**రాజన్న సిరిసిల్ల జిల్లా వజ్ర భారతి న్యూస్ మార్చ్ 05 జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (డా.కళా అశోక్ నక్క):** సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నూతన న్యాయస్థాన భవన సముదాయ నిర్మాణానికి ముహూర్తం ఖరారైంది. పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా, అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించ తలపెట్టిన ఈ భవనానికి ఈ నెల 07వ తేదీ శనివారం శంకుస్థాపన చేయనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.నీరజ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్, హై కోర్టు పరిపాలన న్యాయమూర్తి జస్టిస్ ఎన్. తుకారాం జి పాల్గొంటారు. వీరితో పాటు న్యాయమూర్తులు జస్టిస్ పి. శ్యామ్ కోసి, జస్టిస్ కె. లక్ష్మణ్, జస్టిస్ విజయ సేన్ రెడ్డి, జస్టిస్ వేణుగోపాల్, జస్టిస్ పుల్లా కార్తీక్, జస్టిస్ జె. శ్రీనివాస్ రావు, జస్టిస్ నందికొండ నర్సింగరావు తదితరులు ఈ వేడుకలో పాలుపంచుకోనున్నారని న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు జూపల్లి శ్రీనివాసరావు వెల్లడించారు. జిల్లాలోని అధికార, అనధికార ప్రముఖులు,న్యాయవాదులు, కోర్టు సిబ్బంది అందరూ పెద్ద సంఖ్యలో విచ్చేసి ఈ శంకుస్థాపన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

# విద్యార్థిని విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలి

## పటాన్ చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**జిన్నారం మున్సిపల్ వజ్ర భారతి న్యూస్ మార్చ్ 05 స్టేట్ బ్యూరో (డా.ఏర్పుల శ్రీనివాస్):** సంగారెడ్డి జిల్లా పటాన్ చెరువు నియోజకవర్గం జిన్నారం మున్సిపల్ కేంద్రంలో న్యూలాండ్ పరిశ్రమ సౌజన్యంతో 57 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించిన జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనాన్ని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ప్రారంభించడం జరిగింది, ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ పటాన్చెరు నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల ద్వారా నాణ్యమైన విద్యను విద్యార్థిని విద్యార్థుల అందించి విద్యార్థుల భవిష్యత్తుకి బంగారు బాటలు వేయడం కోసం ప్రజలందరికీ వారి వారి పిల్లలు ప్రభుత్వ పాఠశాల ల ద్వారా అత్యాధునిక పద్ధతి ద్వారా విద్యా బోధనను అందించడం కోసం జిన్నారం మున్సిపల్ కేంద్రంలో ఆధునిక వసతులతో నూతన భవనాలు నిర్మిస్తున్నామని తెలిపారు. విద్యార్థిని విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని, విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు కన్న కలలను సాఫల్యం చేయాలని, ఉపాధ్యాయుల యొక్క ఆకాంక్షలు నెరవేర్చి గొప్ప ప్రయోకులు కావాలని సందేశాన్ని ఇవ్వడం జరిగింది, ఈ కార్యక్రమంలో మెదక్ ఎమ్మెల్సీ అంజిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ నకిర్తి జనార్ధన్, వైస్ చైర్మన్ వంగేటి ప్రతాప్ రెడ్డి, కమిషనర్ తిరుపతి, కౌన్సిలర్లు, పరిశ్రమ ప్రతినిధులు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ,బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు జిన్నారం జి. వెంకటేశం గౌడ్, జిన్నారం మాజీ ఎంపీటీసీ గుట్ట మీద శ్రీనివాస్ రెడ్డి, బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు భోజి రెడ్డి, బిజెపి జిల్లా నాయకులు రాజు రెడ్డి, బురెడ్డి గారి రాజేందర్ రెడ్డి,బి ఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షులు నాయి కోటి రాజేష్, ఆది రామకృష్ణ, బండి శ్రీకాంత్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పుట్టి భాస్కర్, ఎనగండ్ల నరేందర్, ఎర్రవాలి ప్రవీణ్, తోట నర్సింగరావు, పాఠశాల ఉపాధ్యాయులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, మహిళా సంఘాల నాయకులు దళిత బహుజన సంఘాల నాయకులు,యువజన సంఘాల నాయకులు, విద్యార్థిని విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మద్దిమడుగు బిక్షపతి ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ సంఘం నుండి బహిష్కరణ

### నేటి దర్శిని పత్రికల్లో వచ్చిన వార్త నిజం కాదు డా.బుర్రి వెంకన్న

### రాష్ట్ర ఉపాధ్యక్షులు- ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ తెలంగాణ రాష్ట్ర శాఖ




**నల్గొండ జిల్లా వజ్రభారతి న్యూస్ మార్చ్ 05 తెలంగాణ రాష్ట్ర బ్యూరో:** నల్గొండ జిల్లా కు చెందిన ప్రస్తుతం హైదరాబాదులో నివసిస్తున్న మద్దిమడుగు బిక్షపతి అను వ్యక్తి గతంలో ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ సంఘం నియమ నిబంధనలు ఉల్లంఘించినందున ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ రాష్ట్ర కమిటీ నల్గొండ జిల్లా అధ్యక్షుడిగా మద్దిమడుగు బిక్షపతిని తొలగించడం జరిగింది, ఇటీవల నేటి దర్శిని తెలుగు దినపత్రికలో ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నట్టు వచ్చిన వార్తలు పూర్తి అవాస్తవం,తెలంగాణ రాష్ట్ర ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ కమిటీ ద్వారా మద్దిమడుగు బిక్షపతి కొనసాగుటకు ఎలాంటి ఆదేశాలు అనుమతులు ఇవ్వలేద ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు దళిత రత్న డాక్టర్ బుర్రి వెంకన్న స్పష్టం చేస్తూ నేటి దర్శిని లో వచ్చిన వార్త పూర్తిగా వాస్తవమని ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ నాయకుల చే కొండమల్లేపల్లి మండల కేంద్రం అంబేద్కర్ విగ్రహం వద్ద విలేకరుల సమావేశం నిర్వహించి ఒక ప్రకటనలో తెలియజేశారు, నల్గొండ జిల్లా ఇన్చార్జిగా రాష్ట్ర నాయకులుగా బుర్రి వెంకన్న బాధ్యతలు నిర్వహిస్తూ భవిష్యత్తులో నూతన జిల్లా, తాలూకా మండల కమిటీ లను ఏర్పాటు చేసి జిల్లా కేంద్రంలో మహా పరిచయ సభను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు, ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ జిల్లా రాములు. దేవరకొండ డివిజన్ కార్యదర్శి అన్నపాక సంజీవ కొండమల్లేపల్లి మండల కన్వీనర్ మేదరి ప్రసాద్. పీఏ పల్లి మండల ఉపాధ్యక్షుడు చేపూర్ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు

# మహాత్మా గాంధీ విగ్రహంపై దాడి

### దుండగులను వెంటనే అరెస్ట్ చేయాలి ఆర్యవైశ్య సంఘం తూప్రాన్



**తూప్రాన్ వజ్రభారతి న్యూస్ మార్చ్05 తెలంగాణ రాష్ట్ర బ్యూరో (డా.ఏర్పుల శ్రీనివాస్):** మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని తాతపాపన్పల్లి గ్రామంలో ఉన్న మహాత్మా గాంధీ విగ్రహంపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ గురువారం తూప్రాన్ పట్టణ ఆర్యవైశ్య సంఘం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. తూప్రాన్ పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కోవూరి శ్రీనివాస్ గుప్త ఆధ్వర్యంలో సంఘ సభ్యులు సంఘటన స్థలాన్ని పరిశీలించి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటన పథకం ప్రకారమే జరిగి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తూ పూర్తి స్థాయి విచారణ జరపాలని పోలీసులను డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా లయన్ పల్లెర్ల రవీందర్ గుప్త మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చిన మహాత్మా గాంధీ విగ్రహంపై దాడి జరగడం సమాజాన్ని కలవరపరిచే విషయం అని అన్నారు. ఇటీవలి కాలంలో కొన్ని ప్రాంతాల్లో గాంధీ విగ్రహాలను లక్ష్యంగా చేసుకుని దాడులు జరుగుతున్న నేపథ్యంలో తాతపాపన్పల్లి ఘటన కూడా పథకం ప్రకారం జరిగి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు.మహాత్మా గాంధీ వంటి మహనీయుల విగ్రహాలపై దాడులు జరగడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొంటూ, నిందితులను వెంటనే గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.అనంతరం ఆర్యవైశ్య సంఘం నాయకులు తూప్రాన్ పోలీస్ స్టేషన్కు వెళ్లి ఎస్ఐ జ్యోతికి లిఖితపూర్వక ఫిర్యాదు అందజేశారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు పల్లెర్ల రవీందర్ గుప్త, ఐవీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఉప్పల నర్సింలు గుప్త, జిల్లా నాయకులు బుక్క అశోక్, పల్లెర్ల బాలేష్ గుప్త, పెద్దిగారి నగేష్ గుప్త, దేవత శ్రావణ్ కుమార్, బుక్క విజయ్ కుమార్, నేతి సాగర్, ఉప్పల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు

## అసెంబ్లీలో అందరూ ఉంటేనే సమస్యలపై చర్చ

### ఎపి స్పీకర్ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్య

అమరావతి:అసెంబ్లీలో అందరూ ఉంటేనే మసాలా ఉంటుందని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. చర్చలు జరిగితేనే ప్రజల సమస్యలపై పరిష్కారానికి అవకాశం వస్తుందన్నారు. విపక్షం దీనిని ఉపయోగించుకోలేక పోయిందని అన్నారు. గురువారం తన ఛాంబర్లో మీడియాతో నిర్వహించిన చిట్చాట్లో స్పీకర్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల కోసమే ఎమ్మెల్యేలు ఎన్నికవుతారని... అలాంటి ప్రజా సమస్యల పరిష్కార వేదిక అయిన అసెంబ్లీకి గైర్హాజరు సబబు కాదని అన్నారు. వైసీపీలో జగన్ మోహన్ రెడ్డి మినహా మిగిలిన ఎమ్మెల్యేలంతా జీతాలు తీసుకుంటున్నారని స్పీకర్ గుర్తు చేశారు. వైసీపీ సభ్యులకు నోటీసులు ఇవ్వాలంటే తగిన సమయం రావాలన్నారు.అనర్హత వేటు అంశం ఆంధ్రప్రదేశ్లో సక్సెస్ అయితే దేశవ్యాప్తంగా సక్సెస్ అవుతుందని స్పీకర్ అన్నారు. గవర్నర్ ప్రసంగం రోజు అసెంబ్లీకి వచ్చినా అది హాజరుగా పరిగణించాలనే నిబంధన ఎక్కడ ఉందో 'నెంబర్ వన్ స్టూడెంట్' అని చెప్పుకునేవాళ్లు చూపించాలని సవాల్ విసిరారు. గవర్నర్ ప్రసంగం రోజు అసెంబ్లీకి వస్తే.. అది హాజరుగా పరిగణించబడదని స్పష్టం చేశారు. అడ్డగోలు వాదనలు చేసే వారిని ఏమనాలని స్పీకర్ ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రిగా జగన్ మోహన్ రెడ్డికి దక్కాల్సిన అన్ని గౌరవ మర్యాదలు లభిస్తున్నాయని అయ్యన్నపాత్రుడు చెప్పారు. జగన్ తండ్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి పార్టీలకు అతీతంగా అందరు ఎమ్మెల్యేలతో సరదాగా ఉండేవారని గుర్తు చేశారు స్పీకర్.

Printed, Published, Edited & Owned by PAMMI YEDUKONDALU, Published From Door No. 2-2-14, 13th Ward, Komaravaram Road, TANUKU -534 211 West Godavari Dt., A.P.,
Printed at SRI SATYA OFFSET PRINTERS, Venkatrama Theater Street, TADEPALLIGUDEM - 534 102, West Godavari Dt., A.P. Editor : PAMMI YEDUKONDALU

# వరుసగా రెండోసారి ఫైనల్‌కు...

**ముంబై: పరుగుల వరద పారిన ఉత్కంఠభరిత మ్యాచ్‌లో భారత్ చివరకు గెలుపు దిశగా అడుగుపెట్టింది. టి20 ప్రపంచకప్ రెండో సెమీఫైనల్‌లో ఇంగ్లండ్‌పై 7 పరుగుల తేడాతో విజయం సాధించిన భారత్ తుది పోరుకు చేరుకుంది. వాంఖెడే మైదానంలో జరిగిన ఈ పోరులో రెండు జట్లు కూడా బ్యాటింగ్‌లో దూకుడుగా ఆడి ప్రేక్షకులను ఉత్కంఠకు గురి చేశాయి. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 253 పరుగులు సాధించింది. వరల్డ్ కప్ చరిత్రలోనే ఇది అత్యంత భారీ లక్ష్యాల్లో ఒకటి. ఇంత పెద్ద లక్ష్యాన్ని ఎప్పుడూ ఏ జట్టూ ఛేదించలేదనే రికార్డు నేపథ్యంలో భారత్ గెలుపు ఖాయమేనని అనిపించింది. కానీ ఇంగ్లండ్ జట్టు చివరి వరకు పోరాడి మ్యాచ్‌ను ఆసక్తికరంగా మార్చింది. భారత్ ఇన్నింగ్స్‌లో సంజు సామ్సన్ అద్భుత బ్యాటింగ్‌తో ప్రేక్షకులను అలరించాడు. 42 బంతుల్లో 89 పరుగులు చేసిన అతను ఎనిమిది ఫోర్లు, ఏడు సిక్సర్లతో బౌలర్లపై విరుచుకుపడ్డాడు. అతనికి తోడుగా శివమ్ దూబె 25 బంతుల్లో 43 పరుగులు చేయగా, ఇషాన్ కిషన్ 18 బంతుల్లో 39 పరుగులు సాధించి జట్టుకు బలమైన పునాది వేశారు. ఇంగ్లండ్ తరఫున జాకబ్ బెతెల్ ఒంటరిగా పోరాడాడు. 48 బంతుల్లో 105 పరుగులు చేసి శతకం సాధించినా జట్టును గెలిపించలేకపోయాడు. ఎనిమిది ఫోర్లు, ఏడు సిక్సర్లతో అతను భారత బౌలర్లను తీవ్రంగా ఇబ్బంది పెట్టాడు. చివరికి ఇంగ్లండ్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 246 పరుగులు చేసి తృటిలో ఓడిపోయింది.**

## సెమీస్‌లో ఇంగ్లండ్‌పై భారత్ ఘన విజయం
## 7 పరుగుల తేడాతో టీమిండియా గెలుపు
## మెరుపు ఇన్నింగ్స్‌తో చెలరేగిన సంజు సామ్సన్
## జాకబ్ బెతెల్ శతకం వృథా... చివర్లో బౌలింగ్ కట్టుదిట్టం

**ఆదివారం న్యూజిలాండ్‌తో అహ్మదాబాద్‌లో ఫైనల్ మ్యాచ్**



ఈ విజయంతో భారత్ వరుసగా రెండోసారి ప్రపంచకప్ తుది పోరుకు చేరింది. ఆదివారం అహ్మదాబాద్‌లో జరిగే ఫైనల్‌లో న్యూజిలాండ్‌తో భారత్ తలపడనుంది. టి20 ప్రపంచకప్‌లో భారత్, న్యూజిలాండ్ మధ్య ఫైనల్ జరగడం ఇదే తొలిసారి. భారత్ ఇన్నింగ్స్ ప్రారంభంలో అభిషేక్ శర్మ త్వరగా అవుట్ అయినప్పటికీ సామ్సన్, ఇషాన్ భాగస్వామ్యం జట్టును దూసుకుపోయేలా చేసింది. ఆర్చర్ వేసిన ఓవర్లలో సామ్సన్ వరుసగా ఫోర్లు, సిక్సర్లు బాది ఇంగ్లండ్ బౌలర్లను ఒత్తిడిలోకి నెట్టాడు. మరోవైపు ఇషాన్ కూడా వేగంగా పరుగులు చేయడంతో పవర్‌ప్లే ముగిసే సరికి భారత్ స్కోరు 67కు చేరింది. డాసన్ బౌలింగ్‌లో భారీ సిక్స్‌తో సామ్సన్ కేవలం 26 బంతుల్లో అర్ధ శతకం పూర్తి చేశాడు. స్యామ్ కరన్ ఓవర్లో ఇద్దరూ కలిసి 20 పరుగులు సాధించడం భారత్‌కు మరింత ఊపు ఇచ్చింది. రెండో వికెట్‌కు 45 బంతుల్లో 97 పరుగులు జోడించిన తర్వాత ఇషాన్ కిషన్‌ను రషీద్ అవుట్ చేశాడు. అయితే స్పిన్‌ను ఎదుర్కొనే వ్యూహంతో భారత్ బ్యాటింగ్‌లో ముందుగా శివమ్ దూబేను పంపింది. అతను రషీద్ ఓవర్లో రెండు భారీ సిక్సర్లు కొట్టి దూకుడును కొనసాగించాడు. ఆర్చర్ ఓవర్లో కూడా సంజు సామ్సన్ మరో రెండు సిక్సర్లు కొట్టాడు. కానీ భారీ షాట్‌కు ప్రయత్నించి చివరకు అవుట్ అయ్యాడు.



సూర్యకుమార్ ఎక్కువసేపు నిలవకపోయినా హార్దిక్ పాండ్యా వేగంగా పరుగులు సాధించాడు. 12 బంతుల్లో 27 పరుగులు చేసి మూడు ఫోర్లు, రెండు సిక్సర్లు కొట్టాడు. ఆర్చర్ వేసిన 19వ ఓవర్లో తిలక్ వర్మ వరుసగా మూడు సిక్సర్లు బాదడం మ్యాచ్‌లో కీలక మలుపుగా మారింది. చివరి ఓవర్లో పాండ్యా మరో రెండు సిక్సర్లు కొట్టడంతో భారత్ స్కోరు 250 దాటింది. చివరి ఐదు ఓవర్లలోనే భారత్ 76 పరుగులు సాధించడం విశేషం. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లండ్ ప్రారంభంలోనే ఫిల్ సాల్ట్ వికెట్ కోల్పోయింది. జోస్ బట్లర్, హ్యారీ బ్రూక్, టామ్ బాంటన్ కూడా ఎక్కువసేపు నిలవలేకపోయారు. అయినప్పటికీ జాకబ్ బెతెల్ మాత్రం దూకుడుగా ఆడుతూ మ్యాచ్‌ను ఆసక్తికరంగా మార్చాడు. బుమ్రా బౌలింగ్‌లో సిక్స్ కొట్టిన అతను వరుణ్ చక్రవర్తి ఓవర్లో వరుసగా మూడు సిక్సర్లు బాదాడు. హార్దిక్ పాండ్యా ఓవర్లో కూడా వరుసగా సిక్స్, ఫోర్ కొట్టాడు. మరోవైపు విల్ జాక్స్ కూడా 20 బంతుల్లో 35 పరుగులు చేసి అతనికి మద్దతిచ్చాడు. వీరిద్దరూ ఐదో వికెట్‌కు 39 బంతుల్లో 77 పరుగులు జోడించారు. జాక్స్ అవుట్ అయిన తర్వాత స్యామ్ కరన్‌తో కలిసి బెతెల్ మ్యాచ్‌ను గెలిపించేందుకు తీవ్రంగా ప్రయత్నించాడు. చివరి ఐదు ఓవర్లలో 69 పరుగులు చేయాల్సిన దశలో బుమ్రా వేసిన రెండు ఓవర్లలో కేవలం 14 పరుగులు మాత్రమే రావడంతో మ్యాచ్ భారత్ వైపు తిరిగింది. 45 బంతుల్లో శతకం పూర్తి చేసిన బెతెల్ చివరి ఓవర్లో రనౌట్ కావడంతో ఇంగ్లండ్ ఆశలు కరిగిపోయాయి. ఆర్చర్ చివరి బంతుల్లో మూడు సిక్సర్లు కొట్టినా ప్రయోజనం లేకపోయింది. చివరకు భారత్ 7 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో మరో విశేషం ఏమిటంటే 17 ఓవర్లు ముగిసే సరికి ఇంగ్లండ్ స్కోరు భారత్‌కంటే ముందే ఉండడం. 10 ఓవర్లకు రెండు జట్లు 119 పరుగులతో సమంగా ఉండగా, 15 ఓవర్లకు ఇంగ్లండ్ 185 పరుగులతో ముందంజలో ఉంది. అయితే చివరి మూడు ఓవర్లలో భారత్ బౌలర్లు మ్యాచ్‌ను పూర్తిగా మార్చేశారు. సంజు సామ్సన్‌కు ఈ మ్యాచ్‌లో అదృష్టం కూడా కలిసి వచ్చింది. అతను 15 పరుగుల వద్ద ఉన్నప్పుడు ఆర్చర్ బౌలింగ్‌లో కెప్టెన్ బ్రూక్ సులభమైన క్యాచ్‌ను వదిలేశాడు. ఆ తర్వాత సామ్సన్ మరింత దూకుడుగా ఆడి జట్టుకు భారీ స్కోరు అందించాడు. మైదానంలో అక్షర్ పటేల్ ఫీల్డింగ్ కూడా భారత్ విజయానికి కీలకంగా మారింది. ముందుగా సులభమైన క్యాచ్‌తో సాల్ట్‌ను అవుట్ చేయడంతో పాటు అద్భుత క్యాచ్‌తో బ్రూక్‌ను వెనక్కి పంపాడు. అలాగే కీలక సమయంలో బౌండరీ వద్ద పరుగెత్తుకుంటూ వచ్చి విల్ జాక్స్ క్యాచ్‌ను పట్టి మ్యాచ్‌ను భారత్ వైపు తిప్పాడు. ఈ విజయంతో భారత్ ప్రపంచకప్ కాపాడుకునే అవకాశానికి మరింత దగ్గరైంది. ఇక చివరి అడుగు మాత్రమే మిగిలి ఉంది. ఆదివారం న్యూజిలాండ్‌తో జరిగే ఫైనల్‌లో విజయం సాధిస్తే భారత్ మరోసారి ప్రపంచ చాంపియన్‌గా నిలుస్తుంది.

# హైస్పీడ్‌లో వాహన విక్రయాలు

## ఫిబ్రవరిలో 26 శాతం అప్

## 24 లక్షలకు పైగా అమ్మకాలు : ఫాడా




న్యూఢిల్లీ: జీఎస్‌టీ క్రమబద్ధీకరణ నేపథ్యంలో వాహన విక్రయాల జోరు ఫిబ్రవరిలోనూ కొనసాగింది. గత నెల మొత్తం వాహనాల రిటైల్ విక్రయాలు 26 శాతం పెరిగి 24,09,362 యూనిట్లకు చేరినట్లు డీలర్ల సమాఖ్య ఫాడా ఒక ప్రకటనలో వెల్లడించింది. గతేడాది ఫిబ్రవరిలో 19,17,934 యూనిట్లు అమ్ముడైనట్లు పేర్కొంది. దాదాపు అన్ని విభాగాల్లోనూ అమ్మకాల జోరు కొనసాగినట్లు వివరించింది. ఆరింట అయి దు కేటగిరీల్లో (టూవీలర్లు, త్రీవీలర్లు, ప్యాసింజర్ వాహనాలు, కమర్షియల్ వాహనాలు, ట్రాక్ట ర్లు) ఫిబ్రవరిలో అత్యధికంగా రిటైల్ సేల్స్ నమోదైనట్లు ఫాడా ప్రెసిడెంట్ సీఎస్ విఘ్నేశ్వర్ తెలిపారు. మార్కెట్లో పటిష్టమైన డిమాండ్‌ని ఇది సూచిస్తోందని పేర్కొన్నారు. జీఎస్‌టీ క్రమబద్ధీకరణతో రేట్లు తగ్గడం, పెళ్లిళ్ల సీజన్, కొత్త మోడల్స్ రాకతో బుకింగ్స్ మెరుగ్గా ఉండటంలాంటివి పరిశ్రమకు సానుకూలంగా నిల్చినట్లు వివరించారు. పంట దిగుబడులు బాగుండి గ్రామీణ ప్రాంతాల్లో నగదు లభ్యత మెరుగుపడటం, ఆకర్షణీయమైన మార్కెటింగ్ స్కీములు కలిసి వచ్చినట్లు డీలర్లు చెప్పారు.

**ఇతర విశేషాలు..**

- టూవీలర్లు 25%, త్రిచక్ర వాహనాలు 24%, ప్యాసింజర్ వాహనాలు 26%, కమర్షియల్ వాహనాలు 29% అమ్మకాల వృద్ధిని నమోదు చేశాయి.
- ప్యాసింజర్ వాహనాల అమ్మకాలు 3,13,015 యూనిట్ల నుంచి 3,94,768 యూనిట్లకు పెరిగాయి. పట్టణ ప్రాంతాల్లో 21 శాతం, గ్రామీణ మార్కెట్లలో 34 శాతం వృద్ధి నమోదైంది. స్పోర్ట్స్ యుటిలిటీ వాహనాలు, యుటిలిటీ వాహనాలే ఓవరాల్‌గా ఈ విభాగానికి దన్నుగా నిలుస్తున్నప్పటికీ, చిన్న కార్లకు గ్రామీణ ప్రాంతాల్లో డిమాండ్ నెలకొనడం సానుకూలాంశం.
- టూవీలర్ విక్రయాలు 13,60,155 యూనిట్ల నుంచి 17,00,505 యూనిట్లకు పెరిగాయి.
- వాణిజ్య వాహనాల విభాగంలో అమ్మకాలు 78,219 యూనిట్ల నుంచి 1,00,820 యూనిట్లకు పెరిగాయి.
- త్రీవీలర్ సేల్స్ 1,17,130.. ట్రాక్టర్ల అమ్మకాలు 89,418 యూనిట్లుగా నమోదయ్యాయి.




# సెన్కో గోల్డ్ నుంచి షేప్ ఆఫ్ యూ ఏఐ అప్లికేషన్

కోల్‌కతా: ఆభరణాల ఎంపికలో కస్టమర్లకు మరింత సహాయకరంగా ఉండేలా షేప్ ఆఫ్ యూ పేరిట ఏఐ ఫీచర్, అప్లికేషన్‌ని ప్రవేశపెట్టినట్లు సెన్కో గోల్డ్ అండ్ డైమండ్స్ వెల్లడించింది. ఇది తమ అన్ని షోరూమ్‌లతో పాటు సెన్కో యాప్‌లో కూడా అందుబాటులో ఉంటుందని సంస్థ డైరెక్టర్ జోయితా సేన్ తెలిపారు. కస్టమర్లు తమ ముఖాకృతికి తగ్గట్లుగా ఉంటూ, తమ వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించే ఆభరణాలను ఎంపిక చేసుకునేందుకు ఇది సహాయకరంగా ఉంటుందని పేర్కొన్నారు. మరోవైపు మహిళా దినోత్సవం సందర్భంగా 10 గ్రా. పసిడి ఆభరణాలపై రూ. 3,000, అలాగే డైమండ్ ఆభరణాల మేకింగ్ చార్జీల్లో 75% వరకు, డైమండ్ విలువలో 15% వరకు, సిల్వర్ ఐటమ్‌ల మేకింగ్ చార్జీలపై 15% వరకు డిస్కౌంట్లు అందిస్తున్నట్లు తెలిపింది. అటు, ఆన్‌లైన్‌కి సంబంధించి మార్చి 8న (ఒక్కరోజు మాత్రమే) గోల్డ్, డైమండ్, ప్లాటినం జ్యువలరీ మేకింగ్ చార్జీలపై 100 శాతం మినహాయింపు ఉంటుందని పేర్కొంది.



# ఆయనే నాకు సెకండ్ లైఫ్ ఇచ్చారు: వరలక్ష్మి శరత్ కుమార్

### డైరెక్టర్ గా సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించిన వరలక్ష్మి

తన విలక్షణ నటనతో ప్రేక్షకుల మనసుల్లో స్థానం సంపాదించుకున్న నటి వరలక్ష్మి శరత్‌కుమార్. సీనియర్ నటుడు శరత్ కుమార్ కుమార్తెగా ఇండస్ట్రీలోకి వచ్చిన వరలక్ష్మి... ఆ తర్వాత ఇండస్ట్రీలో తన కాళ్లపై తాను నిలబడింది. ఇప్పుడు దర్శకురాలిగా తన సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించింది. డైరెక్టర్ గా తన మొదటి చిత్రం 'సరస్వతి'తో అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో ఆమె మాట్లాడిన మాటలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ... "డైరెక్టర్ గోపీచంద్ మలినేని సార్ నా గురువు, మెంటార్, గైడ్. ఆయన కారణంగానే నేను ఈ రోజు ఇక్కడ ఉన్నాను. ఆయనే నాకు సెకండ్ లైఫ్ ఇచ్చారు" అంటూ ఆమె భావోద్వేగానికి గురైంది. ఇండస్ట్రీలో అమ్మాయిలు సర్వైవ్ అవడం చాలా కష్టమని, వారికి సపోర్ట్ ఇవ్వాలని ఆమె కోరింది. కనబడకుండా పోయిన కూతురి కోసం ఒక అమ్మ ఎంత దూరం వెళుతుందో చూపించే కథాంశంతో 'సరస్వతి' తెరకెక్కుతోంది. ఈ సినిమాలో వరలక్ష్మితో పాటు ప్రియమణి, ప్రకాశ్ రాజ్ తదితరులు నటిస్తున్నారు. తమన్ సంగీతం అందిస్తున్నారు. దోసా డైరీస్ బ్యానర్ పై ఈ సినిమాను నిర్మిస్తున్నారు.

# బెంగళూరులో ఏఎంబీ సినిమాస్... డాల్బీ విజన్ ఆస్వాదించిన మహేశ్ బాబు

### తమ కలలను సాకారం చేస్తున్న ఏఎంబీ బృందాన్ని చూసి గర్వంగా ఉందన్న మహేశ్





టాలీవుడ్ సూపర్ స్టార్ మహేశ్ బాబు ఇటీవల బెంగళూరులో పర్యటించారు. అక్కడ కొత్తగా ప్రారంభమైన తమ ఏఎంబీ సినిమాస్ మల్టీప్లెక్స్‌ను ఆయన సందర్శించారు. దక్షిణ భారతదేశంలోనే తొలిసారిగా డాల్బీ విజన్ టెక్నాలజీతో ఏర్పాటైన ఈ థియేటర్‌లో సినిమా చూసి అద్భుతమైన అనుభూతిని పొందానని వెల్లడించారు. ఈ సందర్భంగా తనపై అభిమానులు చూపిన ప్రేమకు ముగ్ధుడైన మహేశ్, తన సంతోషాన్ని సోషల్ మీడియా ద్వారా పంచుకున్నారు.

"సౌత్ ఇండియాలోనే మొదటి డాల్బీ విజన్‌ను మా ఏఎంబీ సినిమాస్ బెంగళూరులో అనుభవించడం చాలా ప్రత్యేకంగా అనిపించింది. నన్ను చూడటానికి ఎంతో దూరం నుంచి వచ్చిన అభిమానులను కలవడం కూడా అంతే సంతోషాన్నిచ్చింది. బెంగళూరు చూపిన ఈ ప్రేమకు నేను వినమ్రుడినయ్యాను. గాలి నిండా ప్రేమే నిండిపోయింది" అని మహేశ్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. అదేవిధంగా, తమ కలలను సాకారం చేయడానికి అహర్నిశలు శ్రమించిన ఏఎంబీ సినిమాస్ బృందాన్ని చూసి గర్వంగా ఉందని ప్రశంసించారు. హైదరాబాద్‌లో ఇప్పటికే ఏఎంబీ సినిమాస్ విజయవంతంగా నడుస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు బెంగళూరులోనూ తమ బ్రాంచ్‌ను విస్తరించడం ద్వారా మహేశ్ బాబు వ్యాపార రంగంలో మరో ముందడుగు వేశారు. ఈ పర్యటనకు సంబంధించిన ఫొటోలు, మహేశ్ పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.



# గేమ్‌మాస్టర్ ఎవరు?

'మీరు నా నుంచి ఏం కోరుకుంటున్నారో.. ఏం మిస్ అవుతున్నారో అనే విషయాలన్నింటిని నేను గమనిస్తున్నా. 'ఫలక్‌నుమా దాస్' తీయకముందు నాలో ఓ కసి ఉండేది. ఈ సినిమాకు ముందు అది పదింతలు పెరిగింది. పిల్లలు, సున్నిత మనస్కులు ఈ సినిమాకు దూరంగా ఉండండి' అన్నారు విశ్వక్‌సేన్. ఆయన కథానాయకుడిగా స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన మూవీ 'కల్ట్'. తారక్ సినిమాస్ పతాకంపై సందీప్ కాకరాల నిర్మిస్తున్నారు. ఇండియన్ తొలి స్లాషర్ జానర్ (హింస, రక్తపాతంతో కూడిన) మూవీగా వాస్తవ సంఘటనల ప్రేరణతో ఈ చిత్రాన్ని రూపొందించారు. శనివారం టీజర్‌ను లాంచ్ చేశారు. గోవా పబ్‌లో పార్టీ హోస్ట్ మొదలుపెట్టే ఓ ప్రాణాంతకమైన ఆటలో ఓ మిత్రబృందం ఎలా చిక్కుకుంది? ఒక్కొక్కరిని హతమారుస్తూ ముందుకుసాగే ఈ కథలో అసలు గేమ్ మాస్టర్ ఎవరు? అతను రక్షకుడా? ప్రమాదకారుడా? అనే ప్రశ్నలతో టీజర్ ఆసాంతం ఉత్కంఠను పంచింది. ఈ సినిమాలో వందమంది కొత్త నటీనటులున్నారని విశ్వక్‌సేన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్ర మాటల రచయిత తరుణ్‌భాస్కర్, సంగీత దర్శకుడు రవిబస్రూర్‌తో పాటు చిత్ర ప్రధాన తారాగణమంతా పాల్గొన్నారు. గాయత్రీ భరద్వాజ్, తారక్ పొన్నప, మురళీశర్మ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి రచన, నిర్మాత, దర్శకత్వం: విశ్వక్‌సేన్.

# గర్భవతిగానే సినిమా చేశా: లావణ్య త్రిపాఠి

### సినిమా మొదలైన తర్వాత తనకు ప్రెగ్నెన్సీ అని తెలిసిందని వెల్లడి

మెగా కోడలు లావణ్య త్రిపాఠి పెళ్లి తర్వాత కూడా సినిమాల్లో యాక్టివ్‌గా కొనసాగుతోంది. ఇటీవలే ఆమె పండంటి బాబుకు జన్మనిచ్చిన సంగతి తెలిసిందే. మరోవైపు, ఆమె ప్రధాన పాత్ర పోషించిన 'సతీ లీలావతి' మార్చి 6న విడుదలకు సిద్ధమవుతోంది. ప్రస్తుతం ఈ సినిమా ప్రమోషన్ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఈ ప్రమోషన్స్‌లో భాగంగా యాంకర్ సుమ కనకాలకు ఇచ్చిన ఇంటర్వ్యూలో లావణ్య తన ప్రెగ్నెన్సీ సమయంలో ఎదుర్కొన్న అనుభవాలను పంచుకుంది. "ఈ సినిమా పనులు మొదలైన తర్వాత నాకు ప్రెగ్నెన్సీ అని తెలిసింది. సినిమాకు 'నో' చెబితే నిర్మాతలకు నష్టం అవుతుందని భావించాను. అందుకే గర్భవతిగానే షూటింగ్ చేశాను. వాంతులు అయ్యాక కూడా సెట్‌కి వెళ్లేదాన్ని, మైగ్రేన్ వచ్చినప్పుడు టాబ్లెట్స్ వేసుకుని షూట్ చేసేదాన్ని" అని లావణ్య వెల్లడించింది. యాక్షన్ సన్నివేశాలు చేయాల్సి వచ్చినప్పుడు ఎంతో భయం వేసేదని, ప్రతి షెడ్యూల్ ముగిసిన తర్వాత ఆసుపత్రికి వెళ్లి చెకప్ చేయించుకునేదాన్నని చెప్పింది. మూడు నెలల్లోపే షూటింగ్ పూర్తి చేసేలా ప్లాన్ చేశారని తెలిపింది. డ్యాన్స్ సీక్వెన్స్ సమయంలో కూడా భయం వేసిందని, కొరియోగ్రాఫర్ బృందా మాస్టర్ తన పరిస్థితిని అర్థం చేసుకుని స్టెప్స్ సర్దుబాటు చేశారని చెప్పింది. బేబీ బంప్ కనిపించకుండా కాస్ట్యూమ్స్ లూజ్‌గా డిజైన్ చేయించారని వెల్లడించింది. నాలుగో నెలలో కొన్ని సన్నివేశాలు ప్యాచ్‌వర్క్ చేయాల్సి వచ్చిందని తెలిపింది. ఇంట్లోవాళ్లు మొదట భయపడినా, చివరికి పూర్తి సపోర్ట్ ఇచ్చారని, ముఖ్యంగా భర్త వరుణ్ చాలా అండగా నిలిచారని లావణ్య చెప్పింది. డాక్టర్లు ఎక్కువ ప్రయాణాలు చేయొద్దని చెప్పారని... అయితే, షూటింగ్ రామోజీ ఫిల్మ్ సిటీలో జరిగేది కాబట్టి పొద్దున్నే లేచి వెళ్లడం కష్టంగా అనిపించేదని తెలిపారు. "ప్రెగ్నెన్సీ విషయం షూటింగ్ టీమ్‌కు మొదట్లో తెలియదు. తెలిస్తే ప్రత్యేకంగా చూస్తారేమోనని భయంతో చెప్పలేదు" అని ఆమె వెల్లడించింది.





# గాడ్స్ అండ్ సోల్జర్స్

రఫ్ నోట్ ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తున్న ద్విభాషా చిత్రం 'గాడ్స్ అండ్ సోల్జర్స్'. ఆరి అరుజునన్, రాజ్‌తరుణ్, భరత్, అమూ అభిరామి, కిశోర్ ఇందులో ప్రధాన పాత్రధారులు. సినిమాటోగ్రాఫర్ విజయ్ మిల్టన్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం చిత్రీకరణ పూర్తి చేసుకున్నది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో నిమగ్నమైంది. వాస్తవిక సంఘటనలతో వాణిజ్య అంశాల మేళవింపుగా ఈ సినిమా రూపొందుతున్నదని, ఈ సినిమాకోసం అందరూ ప్రాణం పెట్టి పనిచేశారని, కథాపరంగా, సాంకేతికంగా ప్రేక్షకులకు అద్భుతమైన అనుభూతిని పంచే సినిమా ఇదని, త్వరలోనే టీజర్‌ని విడుదల చేయనున్నామని, సినిమా విడుదల తేదీని త్వరలో తెలియజేస్తామని మేకర్స్ చెప్పారు.



# గ్లోబల్ స్టార్ కాబోతున్న ప్రియమణి!

### ఇండో-అమెరికన్ మూవీలో నటించబోతున్న ప్రియమణి

టాలీవుడ్ నుంచి బాలీవుడ్ కు వెళ్లిన ప్రియమణి... పలు వెబ్ సిరీస్‌లలో కూడా నటిస్తూ బిజీగా ఉంటోంది. ఇప్పుడు హాలీవుడ్ మూవీలో నటించేందుకు సిద్ధమవుతోంది. ఇండో-అమెరికన్ చిత్రంలో ప్రియమణి ప్రధాన పాత్రకు ఎంపికయింది. బాలీవుడ్ నటుడు మోహిత్ రైనాతో కలిసి ఆమె ఈ అంతర్జాతీయ చిత్రంలో నటించబోతోంది.హర్ష్ మహదేశ్వర్ దర్శకత్వం వహించనున్న ఈ సినిమాను అమెరికాకు చెందిన రెడ్ బైసన్ ప్రొడక్షన్స్, ముంబైలోని అజూర్ ఎంటర్టైన్మెంట్ సంయుక్తంగా నిర్మించనున్నాయి. ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా నిర్మాణ సంస్థలు అధికారికంగా ప్రకటించాయి.భారతీయ, అమెరికా సంస్కృతుల కలయికతో, ఒక వలస కుటుంబం ఎదుర్కొనే భావోద్వేగపూరిత ప్రయాణమే ఈ సినిమా కథాంశం. హాలీవుడ్ సూపర్ హిట్ సినిమాలకు పనిచేసిన అగ్రశ్రేణి సాంకేతిక నిపుణులు ఈ ప్రాజెక్ట్ కోసం పనిచేస్తుండటం గమనార్హం. ఈ సినిమా షూటింగ్ ఏప్రిల్ లో ప్రారంభం కానుంది.

Printed, Published, Edited & Owned by PAMMI YEDUKONDALU, Published From Door No. 2-2-14, 13th Ward, Komaravaram Road, TANUKU -534 211 West Godavari Dt., A.P., Printed at SRI SATYA OFFSET PRINTERS, Venkatrama Theater Street, TADEPALLIGUDEM - 534 102, West Godavari Dt., A.P. Editor : PAMMI YEDUKONDALU